సంచిక 3 - సెప్టెంబర్ 2016

# LEISA INDIA
# లీసా ఇండియా
## తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా

**సంచిక 3, సెప్టెంబర్ 2016**

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.

**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in

| | |
|---|---|
| **లీసా ఇండియా** | ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు. |
| **ఛీఫ్ ఎడిటర్** | కె.వి.యస్. ప్రసాద్ |
| **మేనేజింగ్ ఎడిటర్** | టి.యమ్. రాధ |
| **అనువాదం** | రామ శేషు సూరంపూడి |
| **అనువాద సమన్వయం** | పూర్ణిమ |
| **అడ్మినిస్ట్రేషన్** | రుక్మిణి జి. జి. |
| **డిజైన్ లేఔట్** | శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్ |
| **ముద్రణ** | స్పాన్ ప్రింట్, బెంగళూరు |
| **కవర్ ఫోటో** | లీసా సూచించిన ఉత్తమ విధానాలతో పాటు కొత్తవంగడాలను ఉపయోగించి అధిక దిగుబడి సాధించిన డి.పి. హళ్ళికి చెందిన రైతన్న వెంకోబా రావు. |
| **ఫోటో** | ఎ.యమ్.ఇ.ఎఫ్ |

## లీసా మేగజైన్

**ఇతర ఎడిషన్లు**

లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్, బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

## లీసా ఇండియా మేగజైన్

**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**

హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ

ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.

మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం

### లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

### ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.

ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. విఠల్ రాజన్, డా. ఎం. మహదేవప్ప, డా. ఎన్. జి. హెగ్డే, డా. టి.ఎం. త్యాగరాజన్, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎ. రాజన్న, డా. వెంకటేష్ తగత్, డా. స్మిత ప్రేమ్‌చందర్ |
| కోశాధికారి | : | శ్రీ బి.కె. శివరాం |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్ |

### మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్దిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులకు,

మట్టి, నీరు వంటి సహజ వనరుల ప్రాముఖ్యతను ఈ సంచికలో మీరు గమనించనున్నారు. వాటిని పరిరక్షించేందుకు చేపట్టవలసిన చర్యలను తెలుసుకుంటారు. వ్యవసాయం ద్వారా ఆదాయం పెంచుకోవటంలోనే కాకుండా, సహజ వనరులను కాపాడుకునేందుకు సమష్టిగా వ్యవసాయదారులు కృషి చేయవలసిన అవసరాన్ని ఈ సంచికలో మీకు వివరించనున్నాము.

సంఘటితంగా కృషి చేయడం అంటే కర్ణాటకలోని 'సహజ సవయవ బెళెగారర సంఘం', కేరళలోని 'కుడుంబశ్రీ' బృందాలు మహిళా రైతులను సమష్టి కృషికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు. సమైక్య శక్తిగా ఏకమైన మహిళా రైతులు తమ వ్యవసాయ అవసరాలకు కావలసిన ముడి సరుకులను సమకూర్చుకోవడం లోనూ, తమ ఉత్పాదనలను మార్కెట్‌కు తరలించి అధిక ఆదాయం సంపాదించడంలోనూ విజయం సాధించారు. వారు తమకంటూ ఒక గుర్తింపును సంపాదించుకోగలిగారు. మరో వైపు, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ వంటి కొన్ని స్వచ్ఛంద సంస్థలు వర్షపాతం స్వల్పంగా ఉండే ప్రాంతాలకు ఉపయోగపడే సేద్య విధానాలను రూపొందించాయి. ఈ విధానాలు అనుసరిస్తే నీటి వినియోగం తగ్గుతుంది. అంతేకాదు, నీటిని మొక్కలు మరింత మెరుగ్గా, పీల్చుకోగలుగుతాయి. మట్టిలో సహజసిద్ధమైన సూక్ష్మజీవజాలం అభివృద్ధి చెందడానికి తోడ్పడతాయి. ఈ విధానాలను ఆచరించి మంచి ఫలితాలు సాధించిన కోలారు జిల్లా రైతన్న అనుభవం ప్రకారం తన పంట పొలంలో ప్రతి అంగుళానికి అతడు ఇచ్చిన ప్రాధాన్యత కారణంగా ఉన్న కొద్దిపాటి వనరులతోనే ప్రతి అంగుళానికి నీటిని అందించగలిగాడు. ఆయన అనుసరించిన సేంద్రీయ సాగు విధానాలు ఆ ప్రాంతంలోని ఇతర అన్నదాతల అందరికీ ఆదర్శంగా మారాయి.

మీ అభిప్రాయాలు మన అందరికీ అమూల్యమైనవి. వాటికోసం మేము కూడా ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాం. మీ తోటి రైతన్నలు ఎవరైనా ఈ మ్యాగజైన్ చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని మీరు ఆశిస్తుంటే వారి పూర్తి చిరునామాను మాకు తెలియజేయండి. సంతోషంగా మేము వారికి ఈ మ్యాగజైన్ అందజేస్తాం.

సంపాదకులు



**స్వార్ (వ్యవసాయ .... పద్ధతి)....................................... కే.ఎస్. గోపాల్** 4

హైదరాబాద్ కేంద్రంగా ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీఓ) సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్న్స్ పర్యావరణ హితకరమైన విధానంలో నీటి కొరత సమస్యకు సులువైన మార్గాలను గుర్తించేందుకు కృషిచేస్తోంది. వర్షపాతం చాలా తక్కువగా ఉన్న ప్రాంతాలలో .......... శ్రమిస్తోంది.



**మహిళా రైతులకు జోహారు ....................................... గీతా కుట్టి పి.ఎస్.** 8

వ్యవసాయ రంగంలో కేరళకు చెందిన మహిళల విజయ గాథలు మరో అపూర్వమైన దృశ్యాన్ని మన కళ్ల ముందు నిలబెడతాయి. మహిళా సంఘాలు సమష్టిగా సాధించిన పురోగతి, ప్రభుత్వపరంగా వారికి లభించే ప్రోత్సాహకాలు, పూర్తిగా వారికి కొండంత అండగా నిలుస్తున్న రుణ పరపతి విధానాలు అక్కడి భూమి లేని మహిళా రైతులను .....కారణమవుతున్నాయి.



**పంట చేల నుంచి నోటి ముద్దగా......................... జి. కృష్ణ ప్రసాద్, బి. సోమేశ్** 12

ఆర్థికంగా రైతన్నను బలపరిచేందుకు మార్కెట్‌తో సన్నిహిత సంబంధాలను సమకూర్చడం చాలా ముఖ్యం. పట్టణ-పల్లె ప్రాంతాల మధ్య సాన్నిహిత్యం నెలకొల్పడానికి రైతు బజార్లది చాలా కీలక పాత్ర. పండించిన చోటి నుంచి నేరుగా వినియోగదారుకు నాణ్యమైన సరుకును చేరవేయడంలో రైతు బజార్లు ప్రముఖ పాత్ర వహిస్తాయి. రైతులకు ....సహజ సమృద్ధి.

**మట్టి మాట్లాడితే... ...................................................................... ప్రొఫెసర్ ఎం. మహాదేవప్ప** 15

మీ అందరికీ నేను బాగా పరిచయమే. ప్రతి రోజు నన్ను పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకూ, నిత్యం చూస్తూనే ఉంటారు. అయినా చాలా మందికి నా గురించి ఏమీ తెలియదు. ఎంతో మంది నన్నో జీవం లేని పదార్థం అనుకుంటారు. వారు నన్ను సరిగా అర్థం చేసుకోనేలేదు. నిర్జీవ పదార్థంగా నన్ను పరిగణించడమే కాదు, ఇతరులను చీదరించుకునే సమయంలో నా పేరెత్తి ఛీ అంటారు. ఉదాహరణ చెప్పాలంటే నీకేం తెలుసు మట్టి ముద్ద అంటుంటారు. ఇష్టం వచ్చినట్టు కాలితో తన్నుతుంటారు.



**ఫార్మర్స్ డైరీ - సేంద్రీయ సేద్యమే సురక్షితం .................... ఎస్.ఆర్. చంద్రశేఖర్** 19

కరువుకాటకాలకు మారుపేరుగా మారిన నెనమనహళ్లి (కోలారు జిల్లా) గ్రామంలో హరిత విప్లవం రావడానికి ఎస్.ఆర్. చంద్రశేఖర్ అనే రైతన్న కృషే కారణమని చెప్పకతప్పదు. కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న ఈ జిల్లా ఇతర విషయాలకన్నా వేల సంఖ్యలో ఉన్న అందమైన చెరువులకు బాగా సుప్రసిద్ధమైంది. ...



నీటి వాడకాన్ని ఇంకా తగ్గించి, స్వార్ పద్ధతిని కూరగాయల పెంపకంలో కూడా ఉపయోగించే అవకాశాలపై విస్తృతంగా ప్రయోగాలు జరుగుతున్నాయి...

# స్వార్ (వ్యవసాయ పునరుద్ధరణకు అనువైన నీటి వాడకం పద్ధతి)

## వ్యవసాయ రంగంలో పొదుపుగా నీటి వాడకంలో ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానం

**కే.ఎస్. గోపాల్**

హైదరాబాద్ కేంద్రంగా ప్రభుత్వేతర సంస్థ (ఎన్జీఓ) సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ కన్సర్న్స్ పర్యావరణ హితకరమైన విధానంలో నీటి కొరత సమస్యకు సులువైన మార్గాలను గుర్తించేందుకు కృషిచేస్తోంది. వర్షపాతం చాలా తక్కువగా ఉన్న ప్రాంతాలలో నీటి పారుదల అభివృద్ధి పరిజ్ఞానాన్ని రూపొందించేందుకు నిరంతరం శ్రమిస్తోంది. రైతన్నలతో కలిసి, వారిలో మహిళా రైతుల సహాయం కూడా తీసుకుంటూ ఈ సంస్థ మొక్కల వేళ్ల దగ్గరికి అవసరమైనంత మేరకే నీటి తేమను చేరవేయడానికి ఉపయోగపడే సాంకేతిక మెళకువలను తయారుచేసింది. తొలి దశలో చేపట్టిన ప్రయోగాలు రెండు ప్రయోజనాలను సాధించవచ్చునని నిర్ధారించాయి. డ్రిప్ ఇరిగేషన్ పాటించటం ద్వారా పంటల సాగుకు మామూలు విధానంలో అవసరమైన దానికన్నా అయిదో వంతు నీరు సరిపోతుంది. ఇది భూసారాన్ని కాపాడటమే కాక, పర్యావరణానికి అన్ని విధాలా మేలు చేస్తుంది. ఈ విధానం ఆశించిన సత్ఫలితాలు సాధించాలంటే పొలం నిండుగా ఒకేసారి నీటిని పారించడం కన్నా, ఒక క్రమంలో మెల్లిగా నీటిని అందించడం చాలా ముఖ్యమైన విషయంగా అంచనా వేసారు. ఇలా చేయడం వల్ల నీటిని ఆదా చేయడమే కాదు, మొక్కలకు తమకు అవసరమైన స్థాయిలోనే నీటి తేమను స్వీకరించేందుకు అవకాశం కల్పిస్తుంది. అంతేకాక, భూమి పొరలలో అతిసూక్ష్మ క్రిముల ప్రకృతి సహజమైన రసాయనక చర్యకు తోడ్పడుతుంది.

మన దేశంలో ఉష్ణ ప్రాంతాలలో తక్కువ స్థాయిలో వర్షపాతం సర్వసాధారణం. అందువల్ల వర్షాకాలంలో కూడా నీటి జల్లు లేని రోజులే ఎక్కువగా ఉంటాయి. ఈ పరిస్థితి వ్యవసాయ కార్యకలాపాలకు చాలా పెద్ద అడ్డంకిగా మారుతుంది. నీటి కొరత సమస్య వల్ల చాలా మంది చిన్న, సన్నకారు రైతన్నలు ఎక్కువగా వర్షాధారిత సాగు మీదే ఆధారపడి ఉంటారు కాబట్టి, వారు అన్ని విధాలా నష్టాలపాలవుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం చెరువులు, ఆనకట్టలను ఆసరాగా చేసుకుని కాల్వల ద్వారా అన్నదాతలకు అవసరమైన నీటిని అందించేందుకు ప్రయత్నిస్తోంది. అదే సమయంలో భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేందుకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తోంది. అందులో భాగంగా నీటిని ఉపరితలానికి చేర్చడానికి ఇంకా ఇంకా లోతుల్లోకి వెళ్లి పైకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తోంది. వీటితో పాటు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని, ఇప్పుడు తాజాగా గ్రీన్ హౌస్ పరిజ్ఞానాన్ని అనుసరించేందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోంది. చిరుధాన్యాల ఉత్పత్తిని అధికం చేసేందుకు ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం కారణంగా కొన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తోంది. ఈ ప్రయత్నాలు సత్ఫలితాలకు దారితీసాయి. ఫలితంగా కప్పుడు భిక్షాపాత్ర పట్టుకున్న భారత దేశం ధాన్యాగారంగా రూపుదిద్దుకుంది. ఈ రకంగా హరిత విప్లవం చోటు చేసుకున్న ప్రాంతాలలో భూసారం దెబ్బతిన్నది. నేలల్లో క్షారగుణం (salinity) అధికంగా పేరుకుపోయింది. దిగుబడులు ఘోరంగా తగ్గిపోయాయి. అంతేకాక, విచ్చలవిడిగా చేపట్టిన సేద్యం కారణంగా భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. ఊహించిన ఫలితానికి భిన్నంగా ఎదురైన ఈ పరిణామాలతో అప్రమత్తమైన భారత ప్రధాని ప్రత్యామ్నాయంగా ప్రతి నీటి ''బొట్టు సాయంతో మరిన్ని ఎక్కువ గింజలను పండించాలని'' పిలుపునిచ్చారు. నీటి వాడకంలో పొదుపు పాటిస్తూ, వినూత్నమైన పరిజ్ఞానం ఆధారం చేసుకుని భూసారాన్ని కాపాడుకోని పక్షంలో ప్రధాని ఆశించిన ఫలితాలు సాధించడం సాధ్యం కాదు.

## సాగునీటి పరిజ్ఞానం ప్రాధాన్యత ఏమిటి?

తెలుగు గడ్డపై వ్యవసాయదారుల జీవనాధారాలను పెంపొందించేందుకు ఈ సంస్థ ఇప్పటికి మూడు దశాబ్దాలుగా నిర్విరామంగా కృషిచేస్తున్నది. ఇంతకాలం చేసిన శ్రమను ఆధారం చేసుకుని వ్యవసాయ రంగం విజయవంతం కావాలంటే నీటి పారుదల వ్యవస్థ చాలా పటిష్టంగా, సమర్ధవంతంగా ఉండాలని గుర్తించింది. దీనికి తోడుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ - MGNREGS) పథకం కింద పల్లె సీమలలోని ప్రతీ కుటుంబానికి కనీసం 100 రోజుల ఉపాధి కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. దీనితో పాటు ఆడవాళ్లు కూడా శ్రమించేందుకు, సంపాదించేందుకు ముందుకు వస్తూ ఉండడంతో ఈ సంస్థకు మరో కోణం వైపు దృష్టి సారించవలసిన పరిస్థితి ఏర్పడింది.

> *డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో అవసరమైన నీటికన్నా దాదాపు నాలుగో వంతు ఒకొక్కప్పుడు అయిదో వంతు నీరే సరిపోయింది.*

ఉపాధి హామీ పథకం కింద లభించిన అవకాశాలతో మహిళలు పెద్ద సంఖ్యలో పండ్లు కాచే తోటల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా ఉపాధిని, ఆదాయాన్ని అందుకోగలుగుతున్నారు. ఇందుకు ఉద్దేశించిన మొక్కలను కనీసం మూడు సంవత్సరాల పాటు జాగ్రత్తగా కాపాడుకోవడం అవసరం. వేసవి కాలంలో ఎంతో దూరం వెళ్లి నీటి కడవలను నెత్తిన పెట్టుకుని మోసుకురావలసిన దుస్థితి మహిళలకు ఎదురైంది. ఇలా నెలల తరబడి శ్రమించవలసి వచ్చేది. ఇది చాలా కష్టంగా ఉన్నప్పటికీ, వేతనం చాలా కీలకంగా మారింది. అయినా కూడా మండు వేసవిలో నీటి వనరుల దగ్గరలో ఎక్కడా ఉండేవి కావు. అదో పెద్ద సమస్యగా మహిళలను పీడించింది. అందువల్ల సాధ్యమైనంత తక్కువ మోతాదులో నీటిని ఉపయోగించడం తప్పనిసరి అయింది. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించవలసి వచ్చింది. అందువల్ల నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలలో నీటిని పొదుపు చేయడంతో పాటు శ్రమశక్తిని కూడా కాపాడుకోవలసి వచ్చింది. అవసరమైన మేరకే నీటిని ఉపయోగించుకునేందుకు అనువైన సాగునీటి పరిజ్ఞానం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సంప్రదాయక విధానాలు

సాగు నీటి అవసరాన్ని తగ్గించే విషయంలోనూ, కొద్దిపాటి నీటితో మెరుగైన ఫలితాలు సాధించడం పైనా రైతు సోదరులతో జరిపిన అనేక చర్చలు ఒక ముఖ్యమైన విషయాన్ని వెలుగులోకి తెచ్చాయి. పవిత్రమైనవిగా ప్రజలు పరిగణించే కొన్ని రకాలైన పండ్ల జాతులు, అలంకారానికి మాత్రమే ఉపయోగపడే రకాలు, ఇంకా ఔషధ గుణాలున్న మొక్కలు చాలా తక్కువ నీటితోనే పెంచడం సాధ్యమవుతుందని తెలిసింది. అందుకు నేలలో పాతిపెట్టిన మట్టి కుండలు సాధనంగా ఉపయోగపడతాయి. సంప్రదాయంగా ఆచరణలో ఉన్న ఈ పద్ధతిలో తక్కువ నీటిని ఉపయోగించటం ద్వారానే చెట్లను కూడా పెంచవచ్చునని తెలిసింది. ఈ పద్ధతిలో మొక్కల వేళ్లకు ఉండే తేమను పీల్చే గుణం, మట్టి కుండలకు ఉండే మరో గుణం - నీటి బిందువుల రూపంలో నీటిని మెల్లిగా విడుదల చేస్తూ తేమను మాత్రమే అందించే - ఆధారంగా నీటి వాడకం చాలా తక్కువగా ఉండేందుకు తోడ్పడతాయి. అయితే ఈ పద్ధతిలో కొన్ని



*రెండేళ్ల పరిశోధనల తరువాత నూతన సేద్య విధానం మొదటి నమూనా సిద్ధమైంది*

సమస్యలు కూడా ఉన్నాయి. ప్రతీ చెట్టుకు కూడా విడివిడిగా నీటి సదుపాయం అందించాల్సి ఉంటుంది. అంతేకాక, మట్టి కుండల తయారీలో నాణ్యతా ప్రమాణాలేవీ ఉండవు. లేదా గడ్డకట్టిన కారణంగా పారుదలకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. వీటిని పరిష్కరించేందుకు శాస్త్రీయ విజ్ఞానాన్ని, రైతుల అనుభవాలను కలగలిపి ప్రయత్నాలు చేయాలని నిర్ణయించారు.

కొత్తగా నీటి పారుదల వ్యవస్థను తయారు చేసేందుకు కొన్ని అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. నీటి అవసరాలను పరిమితం చేసేందుకు చెట్లకు నీటిని అందించడంలో వేళ్లకు మాత్రమే తేమ అందడం ప్రధానమైన విషయంగా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ విధంగా చెట్ల వేళ్లకు కావలసినంత మేరకే నీటిని, తేమను అవసరమైనంత మేరకే అందించాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో విద్యుత్ అవసరం లేకుండా చూడాలనే ఆలోచన వచ్చింది. అదే సమయంలో వేగవంతంగా అనుకున్న విధంగా నీటి సరఫరాను కొనసాగించేందుకు ఏదో ఒక స్థాయిలో యాంత్రికీకరణ అవసరం గుర్తించారు.

అనుకున్న పద్ధతిని తయారు చేసేందుకు రెండేళ్ల పాటు పరిశోదన కొనసాగించవలసి వచ్చింది. మొదటి నమూనాను తయారుచేసిన తరువాత ప్రయోగాత్మకంగా పరీక్షించారు. దాని సాయంతో చెట్ల వేళ్ల వరకు మాత్రమే నీరు అందించే లక్ష్యం నెరవేరింది. కాని, నీటి సరఫరాకు ఉద్దేశించిన పైపులలో పూడిక కారణంగా నీటి ధారకు అడ్డంకులు తప్పలేదు. రెండేళ్ల కృషి ఫలితంగా 2014 ప్రారంభంలో తుది నమూనా సిద్ధమైంది. దానికే ఆంగ్లంలో స్వార్ (system of water for agriculture rejuvenation - SWAR) అన్న పేరు స్థిరపడింది. తెలుగులో మనకి అర్థమయ్యేలా చెప్పాలంటే దానిని - వ్యవసాయ పునరుద్ధరణకు అనువైన నీటి వాడకం పద్ధతి - అని చెప్పవచ్చు. దీనిని మొదట్లో పండ్ల తోటలో ప్రయోగాత్మకంగా పరీక్షించడం జరిగింది. దీనికి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సమన్వయం చేయడమైంది.

## స్వార్ పని చేసే విధానం

వర్షపు నీటిని నిల్వచేయడం లేదా చెరువలో ఉన్న నీటి వనరుల నుంచి నీటిని సేకరించడం తొలి దశ. ఈ రకంగా సమీకరించిన నీటిని ఓవర్ హెడ్ ట్యాంకులోనికి ఎక్కించడం మలి దశ. ఇందుకు కాలితో తొక్కడం ద్వారా పనిచేసే పంపును ఉపయోగించారు. ఇలా ట్యాంకులోకి ఎక్కించిన నీరు వెడల్పు ఎక్కువగా ఉన్న గొట్టాల సాయంతో పొలం దగ్గరకు ప్రవహించే ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి చాలా తక్కువ వెడల్పు ఉన్న గొట్టాలను ఆధారం చేసుకుని, మొక్కల వేళ్ల దగ్గరకి నీరు చేరవేస్తారు. ప్రతీ మొక్కకు దగ్గరలోనూ ఒక డ్రిప్పర్ అమరిక ఉంటుంది. ఆ మొక్కకి అందుబాటులో భూమిలో పాతిపెట్టి ఉంచిన కుండలలోనికి నీటిని ఈ గొట్టాలు చేరవేస్తాయి. అక్కడి నుంచి నీటిని లేదా నీటి తేమ అతి నెమ్మదిగా మొక్కల వేళ్లకి అందుతుంది. వేళ్లకి చాలా దగ్గరగా భూమిలో 30 సెంటీమీటర్ల లోతులో కుండలను ఏర్పాటుచేస్తారు. ఒక్కో కుండకు కనీసం రెండు అతిసూక్ష్మ (మైక్రో ట్యూబ్స్) గొట్టాలు అమర్చి ఉంచుతారు. వాటికి చివర ఇసుక సంచులను కూడా అమరుస్తారు. ఇలా అమర్చిన ఇసుక కారణంగా నీరు ఒక్కసారిగా వేళ్లకు చుట్టూ ఉన్న మట్టిలోకి చేరకుండా నిత్యం తేమ చేరడానికి మాత్రమే తోడ్పడుతుంది. కొంత సేపటికి చెమ్మగిల్లిన కుండ నుంచి నీటి బిందువులు వెలువడతాయి. దీనిని అక్కడి మట్టికి, వేళ్లకు ఉన్న నీటిని పీల్చే గుణం ఆధారంగా మొక్కలు స్వీకరిస్తాయి. కుండలలోనికి నీటిని చేరవేసే ప్రవాహాన్ని నియంత్రించేందుకు అవసరమైన యాంత్రిక నివారణ వ్యవస్థలు (livers) అమర్చి ఉంచుతారు. ఈ కారణంగా భూమ్యాకర్షణ ఆధారంగానే నీరు మొక్కలకు చేరువగా ప్రవహిస్తుంది. మట్టిలో సహజంగా పెరగవలసిన సూక్ష్మజీవాల కోసం, మట్టిలో తేమ నిత్యం పరిమితంగా ఉండేందుకు వీలుగా వ్యవసాయ క్షేత్రంలోని పెంచి పోషిస్తున్న వానపాముల వంటి పురుగులను మట్టిలోకి చేర్చడం తప్పనిసరి.

## తొలి ఫలితాలు

మొదట్లో సాధించిన ఫలితాలే చాలా ప్రోత్సాహవంతంగా కనిపించాయి. డ్రిప్ ఇరిగేషన్‌కు నిర్దేశించిన నీటి పరిమాణంలో కేవలం నాలుగో వంతు నుంచి అయిదో వంతు వరకు మాత్రమే ఉపయోగించినట్టు స్పష్టమైంది. తక్కువ నీటిని ఉపయోగించుకున్నప్పటికీ, మొక్కల ఎదుగుదల పూర్తి సంతృప్తినే ఇచ్చింది.

వాటి ఆకుల సంఖ్య, కాండం ధ్రుఢత్వం, వాటి ఎత్తు, మొక్క పూర్తి స్థాయి పెరుగుదల అన్నీ ఆశించిన స్థాయిలోనే ఉన్నాయి. ఒకసారి ఇలా నీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత మట్టిలో తేమ వారం రోజుల పాటు నిలకడగా నిలిచింది. ఉపరితలంపై నీరు ఎక్కువగా లేకపోవడంతో చీడపీడలు, లేదా అనవసరమైన క్రిమికీటకాల జాడ కనిపించలేదు. అదే సమయంలో భూమిలో పెరిగి సస్య రక్షణకు తోడ్పడే క్రిములు సమృద్ధిగా పెరిగాయి. అందుకు ఆక్సిజన్ అందేందుకు, మట్టిలో తేమ నిలకడగా ఉండేందుకు అనుసరించిన పర్యావరణ హితమైన విధానాలే కారణం.

ఈ స్వార్ పద్ధతి ప్రకారం డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) ప్రచారం 2015లో ప్రారంభించాం. ఈ పద్ధతిలో చేపట్టిన మొక్కల పెంపకం మంచి ఫలితాలనిచ్చే దిశగానే సాగుతోంది. అయితే ఆ సమయంలో రాష్ట్రమంతటా వేడిగాలులు తీవ్రంగా ఉండడం, నీటి కొరత ఎక్కువగా ఉండడంతో వాటి ప్రభావం ఎంత వరకూ ఉన్నదో మా ప్రయోగాల్లో వచ్చిన ఫలితాలు స్పష్టంగా నిరూపించాయి. మంచి ఫలితాలే వచ్చాయి. స్వార్ పద్ధతి అనుసరించడం వల్ల మళ్లీ వర్షాలు కురిసే వరకూ నీటిని పొదుపుగా వాడుకునేందుకు ఇదే సరైన మార్గంగా కనిపించింది. నిజానికి ఇలాంటి ప్రయోజనం డ్రిప్ ఇరిగేషన్ వల్ల లభించడం అసాధ్యం. మహిళలు ఈ విషయంలో ఆసక్తికరమైన అభిప్రాయం వ్యక్తంచేసారు. ''సార్ అచ్చు కన్నతల్లిలా ఉపయోగపడుతుంది. అందుబాటులో ఉన్న పదార్థాలతోనే ఇంటిలోని ప్రతి ఒక్కరి కడుపు నింపడం తల్లి నిర్వహించే అతి ముఖ్యమైన బాధ్యత. మాకు స్వార్ కూడా అదే విధంగా తోడ్పడుతోంది. అదే సమయంలో - డ్రిప్ ఇరిగేషన్ అనేది ఇంట్లో లభించే మొత్తాన్ని, మిగిలిన వారికి ఏమీ మిగల్చకుండా తాను ఒక్కడే అనుభవించే పురుషుడితో పోల్చవచ్చు.'' అంటున్నారు వాళ్లు.

ఇప్పటివరకూ జరిపిన ప్రయోగాలు గమనించిన తరువాత నీటిని మరింత ఆదా చేసే మార్గాల కోసం స్వార్ పరిధిలోనే ప్రయత్నాలు చురుగ్గా సాగుతున్నాయి. 2015లో స్వార్ పద్ధతిలో పూలు, కూరగాయల తోటల పెంపకం కూడా చేపట్టటం జరిగింది. ఫలితంగా మట్టి సారవంతంగా మారింది. మొక్కల ఎదుగుదల సంతృప్తికరంగా కనిపించింది. రైతులకు పండ్లు, కూరగాయల అమ్మకం ద్వారా మంచి దిగుబడి దక్కింది. ఈ రకం మొక్కల పెంపకంలో వాటిని ఒకదానికి మరో దానికి మధ్య దూరం చాలా తక్కువగా ఉంటుంది. ఈ కరణంగా డ్రిప్ ఇరిగేషన్‌తో పోల్చినప్పుడు మరింత ఆదా అయిన నీటి వాడకం కారణంగా వాస్తవానికి కేవలం ఎనిమిదో వంతు నీటితోనే మంచి ఫలితాలు దక్కాయి.

## భవితకు ముందడుగు

అన్ని విధాలా ప్రోత్సాహకరమైన ఫలితాలు రావటంతో స్వార్ పద్ధతికి పారిస్‌లో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో నీటి వినియోగం, అడవుల సంరక్షణలో గ్లోబల్ చాంపియన్ పురస్కారాన్ని సంపాదించుకుంది. నూతన సాంకేతిక నైపుణ్యాలను అంగీకరించేందుకు సహజంగా కొంత సమయం పడుతుంది. ప్రయోగ దశలో రైతులను కూడా భాగస్థులను చేసినప్పటికీ, క్షేత్రస్థాయి పరీక్షలు, సాంకేతిక అభివృద్ధి తీరును గమనిస్తే కరువుకాటకాలతో దిక్కు తోచని స్థితిలో ఉన్న రైతాంగానికి స్వార్ విలువ కొద్దికొద్దిగా అవగాహనకు వస్తోంది. నీటి వాడకంలో మెరుగైన ఒరవడికి దారి చూపే సాంకేతిక విధానాలకు భారత దేశంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. దేశ అవసరాలకు తగినట్లు కృషిచేయడానికి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా బడా సంస్థల అధీనంలో తయారైన సాంకేతిక పరిజ్ఞానానికే ప్రభుత్వపరంగా సబ్సిడీల ప్రయోజనాలు లభిస్తున్నాయి. ఈ పరిస్థితిలో శాస్త్రవేత్తలు తమ పరిశోధనల గురించిన రహస్యాలను ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సేకరణ విధానాలు కూడా చాలా ఖర్చుతో కూడిన వ్యవహారంగా తయారైంది. వీటన్నిటి ప్రభావం కారణంగా స్వార్ విధానంతో సంతృప్తి చెందిన రైతన్నలు, ముఖ్యంగా తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాలలోని వారు, ఈ పద్ధతి సర్వత్రా వ్యాపిత చెందేందుకు తోడ్పడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక, నీటి వాడకంలో మెరుగైన విధానాలను అనుసరించాలన్న ప్రధాని పిలుపు వల్ల కూడా స్వార్ పద్ధతికి మంచి గిరాకీ వాతావరణం తీసుకువచ్చింది. పూర్తిగా వర్షాధారిత సేద్య విధానానికి స్వస్తి చెప్పి వర్షపు నీటిని సేకరించి, నిల్వచేసుకుని, పొదుపుగా ఉపయోగిస్తూ మంచి ఫలితాలను సాధించేందుకు అనువైన సేద్య విధానాల వైపు రైతాంగం దృష్టి కేంద్రీకరించవలసిన సమయం ఇదే. పరిమితం గా అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుతూ, ఆరోగ్యవంతమైన సేద్య విధానాలను, అందులో భాగంగా భూసారాన్ని పెంపొందించే లక్ష్యంతో వ్యవసాయ రంగం ముందుకు అడుగులు వేసినప్పుడే దేశంలో సేద్య రంగం నిలకడైన విధానాలు అనుసరించాలి. అప్పుడే రైతన్నలకు ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. ◆

**K S GOPAL**
Centre for Environment Concerns
Hyderabad, India.
Email : cecgopal@yahoo.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 17, సంచిక 3, సెప్టెంబర్ 2015.



వరి చేలలో సేద్యం పనుల్లో నిమగ్నమై ఉన్న మహిళలు

# మహిళా రైతులకు జోహారు

## కేరళలో మహిళల సమిష్టి కృషి – ఒక అధ్యయనం


### గీతా కుట్టి పి.ఎస్.


**వ్యవసాయ రంగంలో కేరళకు చెందిన మహిళల విజయ గాథలు మరో అపూర్వమైన దృశ్యాన్ని మన కళ్ల ముందు నిలబెడతాయి. మహిళా సంఘాలు సమిష్టిగా సాధించిన పురోగతి, ప్రభుత్వపరంగా వారికి లభించే ప్రోత్సాహకాలు, పూర్తిగా వారికి కొండంత అండగా నిలుస్తున్న రుణ పరపతి విధానాలు అక్కడి భూమి లేని మహిళా రైతులను కూడా సేంద్రీయ వ్యవసాయంలో తలెత్తుకు నిలిచేందుకు కారణమవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో వారికి ఒక గుర్తింపు, ప్రత్యేకత లభించాయి. వరి, కూరగాయలు, అరటి తోటలు, రకరకాల దుంపల సాగులో మహిళలు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సంఘటిత శక్తిగా మారిన మహిళా బృందాలు తమ సత్తా చాటుతున్నాయి.**

ఇప్పటికి మూడు దశాబ్దాలుగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించే ధోరణి ఎక్కువ అయింది. ఇందుకు ప్రధానమైన కారణం - ఆర్థిక పరంగా వచ్చిన మార్పులే. కార్మిక శక్తి చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం కావడం, సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడం, ఫలితంగా సేద్యం లాభసాటి కాకపోవడం, ఈ పరిస్థితిని మరింత దిగజార్చే విధంగా వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాల వల్ల భూయజమానుల్లో సేద్యం పట్ల ఆసక్తిని తగ్గించివేస్తూ వచ్చింది. దాంతో వాళ్లంతా వ్యవసాయ పనులకు దూరమైపోయారు. ఇప్పుడు కళ తప్పిన మైదానాల్లా పొలాలు మారిపోయి కనిపిస్తున్నాయి. సాగు పనులు కొరవడడంతో ఉపాధి అవకాశాలు సన్నగిల్లిపోయాయి. ఈ పరిస్థితి కూలీ పనులే జీవనాధారమైన మహిళల బతుకులను చిందరవందర చేసాయి. వారి కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో పడ్డాయి. కేరళ రాష్ట్రంలో వ్యవసాయ పనుల్లో ఎప్పుడూ మహిళలు ప్రధాన

పాత్ర పోషిస్తూ ఉంటారు. సేద్యం పనుల్లో వారు కుటుంబానికి తోడుగా ఎలాంటి కూలీ లేకున్నా చేయూత ఇస్తుంటారు. లేదా ఇతరుల పొలాల్లో కూలీకి వెడుతుంటారు. ఇలా ఆదాయం సంపాదించి పెట్టడంలో లేదా ఖర్చు భారం తగ్గించడంలో మహిళల పాత్ర చాలా కీలకమైనది.

ఈ రాష్ట్రంలో మహిళా సంఘాలకు ఎదురవుతున్న పెద్ద సమస్య - సేద్యం చేయడానికి వారికి తగినంత భూ వసతి దొరకడం లేదు. తమ భూములను కౌలుకు ఇస్తే వాటిపై తమకు హక్కులు చేజారిపోతాయనే భయం ఎక్కువగా ఉండడం అందుకు ఒక కారణం. ఇక్కడ అమలులో ఉన్న భూ సంస్కరణల చట్టం ప్రకారం, వ్యవసాయ అవసరాల కోసం భూమిని కౌలుకు ఇవ్వడం నిషిద్ధం. అయినప్పటికీ వివిధ రూపాలలో భూములను కౌలుకు ఇవ్వటం, ఇతరులకు సేద్యం పనులకు అప్పగించటం జరుగుతూనే ఉంటుంది. అలాంటి భిన్న రూపాలలో కుదుర్చుకునే ఒప్పందాలలో కూడా చాలా మంది భూ యజమానులు తమ భూములను మహిళా రైతులకు అప్పగించేందుకు సిద్ధంగా లేరు. ఇది మహిళా సంఘాలకు ఎదురవుతున్న చాలా పెద్ద సమస్య. ఈ కారణంగా వాళ్లు నిలకడగా వ్యవసాయపు పనులు చేపట్టలేకపోతున్నారు.

ఈ రకంగా వ్యవసాయ కార్యకలాపాలలో మహిళలకు అవకాశం ఇవ్వడం అన్న ఆదర్శం కేరళలో ప్రభుత్వ వర్గాలకు చాలా గొప్ప అవకాశంగా కనిపించింది. సమాఖ్యలుగా ఏర్పడిన మహిళా సంఘాలకు ప్రోత్సాహం ఇవ్వటం చాలా ప్రయోజనకరంగా కనిపించింది. అందుకు సూక్ష్మ రుణ పరపతి సదుపాయం కల్పించటంతో పాటు వారు నివసించే ప్రాంతాలకు చేరువలోనే బీడు భూములను వారికి అప్పగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది. ఇందుకోసమే కుడుంబశ్రీ పథకం రూపుదిద్దుకుంది.

## కుడుంబశ్రీ పథకం

కేరళలో పేదరికం నిర్మూలన లక్ష్యంగా కుడుంబశ్రీ పథకం 1998లో ప్రారంభమైంది. రాష్ట్రంలో పేదరికం నిర్మూలన మిషన్ కింద మహిళా బృందాలను ఏర్పాటు చేశారు. ఇవి స్థానిక ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేయవలసి ఉంటుంది. ఈ కృషిలో పేద కుటుంబాలలో పేదరికాన్ని దూరం చేయటమే కాక

> కుడుంబశ్రీ పథకం కారణంగా మహిళల సమిష్టి శక్తి మరింత పటిష్టంగా తయారైంది. దానికి తోడు తక్కువ వడ్డీకే రుణ సదుపాయాలు ఉండడంతో మహిళలు చురుగ్గా వ్యవసాయ పనులు చేపట్టేందుకు ప్రోత్సాహం లభిస్తోంది. ఫలితంగా భూమి లేని మహిళలు కూడా సేద్యం చేపట్టేందుకు ముందుకు వస్తున్నారు.

వారికి సామాజికంగా పురోగతి సాధించేందుకు తోడ్పడాలనేది ప్రభుత్వ ఉద్దేశం. దీనితోపాటు మహిళలకు సాధికారికత కల్పించాలనే లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుంది. స్థానిక పాలనా సంస్థ పరిధిలో అంటే గ్రామ పంచాయతీ లేదా పట్టణ పాలక వ్యవస్థ పర్యవేక్షణలో కుడుంబశ్రీ అమలు చేస్తారు. ఈ కుడుంబశ్రీ కింద మూడు అంచెల మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తారు. అవి - పరిసరాల పరిధి (ఎన్ఎచ్జీ) బృందాలు (Neighborhood group - NHG), ప్రాంతీయ పరిధి (ఏడీఎస్) బృందంగాను(Area development Society - ADS), సామాజిక పరమైన (సీడీఎస్) బృందాలు (Community development society - CDS)గానూ వ్యవహరిస్తారు.

ఒక నివాస ప్రాంతంలో నివసించే ఇరుగుపొరుగు వారు సభ్యులుగా ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన వారి నుంచి పది నుంచి ఇరవై మంది వరకూ సభ్యులు ఉండేలా పరిసరాల పరిధిలోని మహిళలు అంతా ఏకమై ఒక బృందంగా (ఎన్ఎచ్జీ) ఏర్పడవలసి ఉంటుంది. దీనిని అట్టడుగు స్థాయిలోని మహిళా బృందంగా చెప్పుకోవాలి. ఉదాహరణకు ఒక వార్డు పరిధిలోని మహిళా ఎన్ఎచ్జీలు అన్నీ ఏకమై ఆ ప్రాంతీయ స్థాయి సొసైటీగా (ఏడీఎస్) ఏర్పడుతారన్న మాట. అలాంటి బృందాన్ని ప్రాంతీయ అభివృద్ధి సొసైటీ (ఏడీఎస్) అంటారు. ప్రతీ పరిసరాల పరిధి బృందాల నుంచి అయిదుగురు సభ్యులుగా ఇందులో (ఏడీఎస్) కార్యనిర్వాహక వర్గంగా వ్యవహరిస్తారు. ఇది మధ్య స్థాయిలోని సమాఖ్య కాగా అత్యున్నత స్థాయిలో ఎల్ఎచ్జీలు అందులో సభ్య బృందాలుగా పనిచేస్తాయి.

సీడీఎస్ అన్నది దాదాపుగా ఒక గ్రామం మొత్తం పరిధిలో పనిచేస్తుంది. ఇది ఆ గ్రామ స్థాయిలోని అన్ని ఎన్ఎచ్జీల మధ్య కుడుంబశ్రీ పథకం అమలు, పర్యవేక్షణ విధులను నిర్వహిస్తుంది. సీడీఎస్ పర్యవేక్షణలోనే ఆ గ్రామపరిధిలోని మొత్తం మహిళలకు అవసరమైన రాతకోతల వ్యవహారాల నిర్వహణకు వీలుగా ఒక వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. ఈ వ్యవస్థలోని సభ్యులు ఇతర మహిళా సంఘాల సభ్యుల తరపున రుణ దరఖాస్తులను సిద్ధం చేయడం, ఇతరులకు మార్గదర్శకం చేయటం వంటి విధులు, బాధ్యతలు నిర్వహిస్తారు. అంతేకాక, గ్రామ పంచాయతీ తరపున, వ్యవసాయ శాఖ అధికారుల తరపున అవసరమైన పూర్తి సహాయసహకారాలు అందజేస్తారు. పంట రక్షణ పద్ధతులు తెలియజేస్తారు. మహిళా బృందాలు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే బాధ్యతను కూడా నిర్వహిస్తారు. అవసరమైన సాంకేతిక శిక్షణ సాధారణంగా ఈ వ్యవస్థలో 250 నుంచి 300 బృందాలు ఉంటాయి.

సీడీఎస్, ఎల్ఎచ్జీలు భాగస్వామ్య పాలనకు, అభివృద్ధి కార్యకలాపాలు అట్టడుగు స్థాయి నుంచి సామాజిక సాధనంగా



మార్కెట్‌కు తరలించేందుకు తాము పండించిన బియ్యాన్ని ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

ఉపయోగపడుతుంది. అంతేకాక, ఎల్‌ఎస్టీలు తమకు అందుబాటులో ఉన్న వనరులను సమష్టిగా ఉపయోగించుకుని అందరూ పురోగతి సాధించేందుకు తోడ్పడుతుంది. ఆ క్రమంలో పేదరికం నిర్మూలనలో కీలకపాత్ర పోషిస్తుంది. సంఘటిత శక్తిగా తయారైన మహిళా సంఘాలకు అవసరమైన రుణవరపతి సదుపాయాన్ని జీరో వడ్డీకి అందించడానికి ఈ పథకం అవకాశం ఇస్తుంది. కారణం ఏమిటంటే మహిళా సంఘాలలో ప్రతి సభ్యులు తాము విడివిడిగా మాత్రమే కాక, మొత్తం వారి బృందం సమష్టిగా తీసుకున్న రుణాలకు ఉమ్మడిగానే బాధ్యులవుతారు. దీనినే ఉమ్మడి రుణ బాధ్యతగా (జాయింట్ లయబిలిటీ గ్రూప్-జెఎల్బీ) వ్యవహరిస్తారు. ఇలాంటి జేఎల్బీ గ్రూపులకు రుణసహాయాన్ని నాబార్డ్ అందిస్తుంది. దీనికి తోడు జాతీయ గ్రామీణ జీవనాధారాల కల్పన మిషన్ (నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్ - ఎన్ఆర్ఎల్ఎం) కింద ఏర్పాటుచేసిన మహిళా కిసాన్ సశక్తీకరణ్ పరియోజన నుంచి కుడుంబశ్రీ పథకానికి కొంత సబ్సిడీ లభిస్తుంది. ఈ కారణంగా కూడా మహిళా రైతులకు తక్కువ వడ్డీలకే రుణసదుపాయం అందుతుంది. ఈ రకమైన ప్రోత్సాహకాల కారణంగా మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయాన్ని తమ ఉపాధి మార్గంగా చేపట్టేందుకు సాధ్యమవుతోంది.

అల్పాదాయ వర్గాలకు చెందిన సుమారు 2.8 లక్షల మంది మహిళలు సమైక్యమై 61,836 ఉమ్మడి రుణబాధ్యత గ్రూపులుగా సంఘటితమయ్యాయి. ప్రస్తుత సంవత్సరంలో వీరంతా కలిసి రాష్ట్రంలోని 38,706 హెక్టార్ల బీడు భూములను సస్యవంతం చేయగలుగుతున్నారు. మహిళా రైతుల కృషి కారణంగా దాదాపు 39 వేల హెక్టార్ల క్షార భూములు పంటలతో కళకళలాడుతున్నాయి.

వారు పండించే పంటల్లో చెప్పుకోవలసినవి - వరి (10,934 హెక్టార్లు), అరటి తోటలు (10,648 హెక్టార్లు), దుంపలు వంటివి (8686 హెక్టార్లు), కాయగూరలు (8476 హెక్టార్లు), ఇతర పంటలు (14,433 హెక్టార్లు).

## పర్యావరణహితమైన సమష్టి సేద్యం

ఈ విధంగా వ్యవసాయం తమ ప్రధాన ఉపాధి మార్గంగా ఎంపిక చేసుకున్న మహిళల్లో చాలా మంది పర్యావరణహితమైన సేద్య విధానాలనే అనుసరిస్తున్నారు. చాలా తక్కువ మోతాదులో రసాయనిక ఎరువులను ఉపయోగిస్తున్నారు. అత్యధికులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులనే పాటిస్తున్నారు. సేంద్రీయ ఎరువులుగా కొంతమంది సొంతంగా ఎరువులను తయారుచేసుకుంటున్నారు. ఇందుకు ఆవు లేక పశువుల పేడ, పౌల్ట్రీ వ్యర్థాలు, పెద్దపెద్ద చెట్ల నుంచి రాలిపడే ఆకులు, అలములు, వానపాముల ఎరువులు (వర్మీ కంపోస్టు), జనుప నార వ్యర్థాలను ముడి సరుకులుగా వాడుతున్నారు. ఇలా పర్యావరణహితమైన విధానాలు ఉపయోగించటం వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గిపోతాయని, శ్రామిక శక్తి అవసరం తగ్గిపోతుందని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిగా లాభాల శాతం తగ్గినా వారు ప్రజలకు తక్కువ ధరలలోనే నాణ్యమైన ఉత్పాదనలను అందించేందుకే ఆసక్తి చూపిస్తున్నారు.

కొంతమంది మహిళలు తమ ఉత్పాదనలను శుద్ధి చేసి వినియోగదారులకు అందించేందుకు కూడా సిద్ధమైపోతున్నారు. ఆ రకంగా వాటికి అదనపు ధరలను రాబట్టుకోగలుగుతున్నారు. అలంకోడ్, తెన్నెల గ్రామాలలో మహిళా రైతులు సాగుచేసిన ధాన్యాన్ని స్థానికంగా ఉన్న మిల్లులలోనే ఆడించి, సొంతంగా బ్రాండ్ ఏర్పాటుచేసుకుని మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆ రకం గానే తెన్నెల రైస్, పుథారి సేంద్రీయ రైస్ (అలంకోడ్) బియ్యం మార్కెట్లో లభిస్తోంది. ఇదే విధంగా వేర్వేరు పేర్లతో ఫ్లేక్స్, బియ్యపు పిండి, అటుకులు (బ్రోకెన్ రైస్) వంటివి కూడా మార్కెట్లో లభిస్తున్నాయి. ఇక్కడి మహిళల వినూత్న ఆలోచనలన్నింటికీ నాబార్డ్ నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. ఫలితంగా మహిళా ఉత్పాదక కంపెనీల ఏర్పాటు సాధ్యమవుతోంది.

## సత్ఫలితాలు

''ఇప్పుడు మేము కూలీలం కానేకాదు, సొంతంగా భూమిని సాగుచేస్తున్న సేద్యగాళ్లం'', ''నా పిల్లలకి ఇప్పుడు ఉన్నత వృత్తి విద్య అందించగలుగుతున్నాను'', ''నా కుమార్తె వివాహానికి బంగారం కొనుగోలు చేయగలుగుతున్నాను'', ''నేనో ద్విచక్ర వాహనం కొనుక్కున్నాను'', ''నా పేరు మీద పొలం, ఇల్లు సంపాదించుకున్నాను'', ''నా మగనికి ద్విచక్రవాహనం కొని ఇచ్చాను, ఆయన వ్యాపారం మెరుగవడానికి సహాయపడ్డాను'', ''నా కుటుంబానికి ఏడాది పొడవునా అవసరమైన బియ్యం నేను సొంతంగా పండించి నిల్వచేసుకోగలిగాను'', ''నన్ను ఇప్పుడు మా ఇంట్లో వాళ్లంతా ఆదాయం తెచ్చి పెట్టే సంపాదనపరురాలిగా గౌరవిస్తున్నారు. నిర్ణయాలు తీసుకునేప్పుడు నా సలహాలను తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు'', ''రుణ సహాయం

కోసం నాభర్త నా సాయం కోరాడు, నా ఇరుగుపొరుగు వాళ్లు పంచాయతీ నుంచి పూర్తి సమాచారం తెలుసుకునేందుకు నన్నాశ్రయిస్తున్నారు.'' ఇవి అక్కడ ఒక్కో మహిల నోటి నుంచి వినిపించిన మాటలు. వాటిలో వారిలో తొణికిసలాడుతున్న ఆత్మవిశ్వాసం, వారికి లభిస్తున్న గౌరవమన్ననలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. కుడుంబశ్రీ సాధించిన విజయ గాథలకు ఇవి సాక్షీరూపాలు.

ఎంపిక చేసుకున్న కొన్ని గ్రామ పంచాయితీలు... అన్నమనడా (త్రిసూర్), అలత్తూరు (పాలక్కడ్), అలంకోడ్, తెన్నెల (మలప్పురం) - కుడుంబశ్రీ కుటుంబాల విజయానికి కేంద్రాలుగా నిలిచాయి. వారికి స్థానిక పంచాయతీలు, వ్యవసాయ కార్యాలయాలు రుణ దరఖాస్తులు, అవసరమైన భూమిని లీజుపై మహిళా బృందాలకు అందించేందుకు తగిన వసతులు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన భూములను సొంతంగా సేద్యం చేసుకునేందుకు సిద్ధంగా లేని భూ యజమానుల నుంచి సేకరిస్తున్నారు. భూ యజమానుల దగ్గర ఉన్న భూములు నిరుపయోగంగా పడి ఉండటం వల్ల కలిగే నష్టాలు, వాటిని ఇలాంటి మహిళా సంఘాలకు అందించి వాటిని సస్యశ్యామలం చేయటంవల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించేందుకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులను ఏర్పాటుచేస్తున్నారు. ఇలా సేకరించిన భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేయటం వల్ల కలిగే లాభాలను మహిళా సంఘాలకు వివరిస్తున్నారు. అందుకు అనుసరించవలసిన విధివిధానాలను ఇరు వర్గాలకు తెలియజేసేందుకు వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నిర్విరామంగా కృషి జరుగుతోంది. మహిళలు కౌలుకు తీసుకునేందుకు మూడేండ్ల వ్యవధిని నిర్ణయిస్తున్నారు. ఇది ఇరు పక్షాలకు ధీమా ఇస్తున్నది. ఆసక్తి కలిగించే మరో విషయం ఏమిటంటే - అలంకోడ్, తెన్నెల పంచాయతీల పరిధిలో మహిళా నేతలు స్థానిక వరి పండించే రైతుల సంఘాలకు - వాటిని పాదశేఖర కమిటీలుగా వ్యవహరిస్తారు - కన్వీనర్లుగా విధులు, బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ కమిటీలను వ్యవసాయ శాఖ ఏర్పాటు చేస్తుంది.

ఇదివరలో మహిళా సంఘాల వారికి రుణ సదుపాయం ఇవ్వటానికి బ్యాంకు అధికారులు అంతగా ఆసక్తి చూపించేవారు కాదు. కానీ ఇప్పుడు ఈ మహిళా బృందాల పని తీరును పరిశీలించి వాటికిచ్చిన రేటింగ్ ప్రకారం విశ్వసనీయతకు మారు పేరుగా గుర్తించారు. జేఎల్జీ పథకం కారణంగానూ, మహిళా బృందాలను నిర్వహించడంలో వారు చూపిస్తున్న సామర్థ్యాన్ని గుర్తించడమే బ్యాంకులు, వాటి అధికారులు ఇప్పుడు రుణసదుపాయం అందించేందుకు అవసరమైన నమ్మకాన్ని కలిగిస్తోందనటంలో ఎలాంటి సందేహం లేదు. వీటన్నిటి ఫలితం గానే నేడు కేరళలోని మహిళలు వ్యాపారదక్షతకు పేరుప్రఖ్యాతలు సంపాదించుకోగలిగారు.

## పర్యావరణ సేద్య విధానాలకు వాళ్లే రక్షకులు

నీటి సదుపాయం పుష్కలంగా ఉన్న తడి నేలల్లో వ్యవసాయాన్ని చేపట్టడంలో వారు చూపిస్తున్న నైపుణ్యం, నేర్పు నేపథ్యంలో వారికి అవసరమైన ముడిసరుకులు, వనరులు అందించినప్పుడే వారు వారి కుటుంబాలకు లాభదాయకమైన సంపాదనపరులుగాను, గౌరవనీయమైన సభ్యులుగానూ నిలదిక్కుకోగలుగుతారు. సమాజం గుర్తింపును పొందగలుగుతారు. కుడుంబశ్రీ పథకం కారణంగా వారిలో నెలకొన్న సంఘటిత శక్తి, తక్కువ వడ్డీ రేట్లకే లభిస్తున్న రుణసహాయం ఆధారంగా పేద కుటుంబాలకు చెందిన మహిళలు రైతులుగా నిలదొక్కుకోగలుగుతున్నారు.

కేరళలో పర్యావరణహితమైన వ్యవసాయం అభివృద్ధికి మహిళా బృందాలు ప్రధాన కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. వరి సేద్యంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వారి చేతిలో పడిన తరువాత అంతకాలం నిరుపయోగంగా పడి ఉన్న భూములు వరి చేలతో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు ఈ పేద మహిళలే సగర్వంగా సురక్షితమైన, నాణ్యమైన బియ్యాన్ని స్థానిక ప్రజలకు అందజేయగలుగుతున్నారు. అదే సమయంలో తమ కుటుంబాలకు తగినంత ఆదాయం సంపాదించిపెట్టి మెరుగైన జీవిత ప్రమాణాలు చేకూర్చగలుగుతున్నారు ◆

**GEETHAKUTTY P S**
Professor and Project Co-ordinator
Centre for Gender Studies in Agriculture
Kerala Agricultural University
Vellanikkara, Thrissur, Kerala
Email : geethakutty@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 17, సంచిక 4, డిసెంబర్ 2015.

# పంట చేల నుంచి నోటి ముద్దగా ...

## సహజ ఆర్గానిక్స్ కృషి ఫలితం


### జి. కృష్ణ ప్రసాద్ – బి. సోమేశ్


**ఆర్థికంగా రైతన్నను బలపరిచేందుకు మార్కెట్‌తో సన్నిహిత సంబంధాలను సమకూర్చడం చాలా ముఖ్యం. పట్టణ-పల్లె ప్రాంతాల మధ్య సాన్నిహిత్యం నెలకొల్పడానికి రైతు బజార్లది చాలా కీలక పాత్ర. పండించిన చోటి నుంచి నేరుగా వినియోగదారుకు నాణ్యమైన సరుకును చేరవేయడంలో రైతు బజార్లు ప్రముఖ పాత్ర వహిస్తాయి. రైతులకు, వినియోగదారులకు మధ్య వారధిగా రైతు సోదరులు, వ్యవసాయ నిపుణులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థే సహజ సమృద్ధి.**

సహజ సమృద్ధ అంటేనే అందమైన ప్రకృతి వరం అని అర్థం. ఇది రైతన్నలతో కలిసి పనిచేస్తుంది. దేశీయ వంగడాలను కాపాడుతూ వాటిని మరింతగా మెరుగుపరచడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. మన దేశంలో సమృద్ధిగా ఉన్న సహజసిద్ధమైన జీవ వైవిధ్యాన్ని కాపాడవలసిన అవసరం గురించి సర్వత్రా అవగాహన కలిగించడమే ఈ సంస్థ ఆశించిన ప్రధానమైన లక్ష్యం. తొలి దశలో రైతు సోదరులు తమ ఆలోచనలను, విత్తనాలను, విజ్ఞానాన్ని పరస్పరం అందచేసుకుంటూ సుస్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి కృషి చేసేందుకు ఈ సంస్థ ఆవిర్భవించింది.

సేంద్రీయ సేద్యం ద్వారా ఉత్పత్తి చేసిన ఉత్పాదనలను విక్రయించుకునేందుకు సరైన మార్కెట్ అవకాశాలు కర్ణాటకలో లేవు. ఈ కారణంగా సేంద్రీయ సేద్యం చేస్తున్న ఇక్కడి రైతు సోదరులు తమ ఉత్పత్తులను మార్కెట్లో విక్రయించుకునేందుకు అవకాశాలు ఉండేవి కావు. ఫలితంగా వారు స్థానిక మార్కెట్ పైనే ఆధారపడవలసివచ్చేది. అది వారి ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీసింది. సహజ సమృద్ధ సంస్థ రంగంలోకి వచ్చిన తరువాత ముందుగా వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు మధ్య ఉభయ తారకమైన సాన్నిహిత్యానికి బాటలు వేసింది. ఇందుకు సహజ ఆర్గానిక్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ పేరుతో సంస్థ ప్రారంభించిన బ్రాండ్ రూపుదిద్దుకుంది. ఈ బ్రాండ్ ద్వారా సేంద్రీయ ఉత్పాదనలు మార్కెట్‌లో ప్రవేశించాయి. ఈ సంస్థలో దాదాపు 750 మంది సేంద్రీయ సేద్యగాళ్లు సభ్యులుగా, ప్రధాన వాటాదారులుగా చేరారు. వీరు కాక 2500 వ్యవసాయ కుటుంబాలు (అవి కూడా 30 రైతు సమాఖ్యలుగా) ఇందులో భాగస్తులుగా చేరారు.



*జొన్న సాగులో వైవిధ్యం తెచ్చిన సంబరం....*

సహజ సమృద్ధ సంస్థ సమన్వయకర్తగా ఉత్పత్తిదారులు తమ ఉత్పాదనలను వినియోగదారులకు పరిచయం చేసేందుకు వీలుగా ప్రదర్శించేందుకు, ఆ విధంగా విక్రయించుకునేందుకు అవకాశాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పంట ఉత్పత్తులను అమ్ముకోవడంలో రైతులకు గిట్టుబాటు ధర వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. రైతు నుంచి నేరుగా సేకరించిన ఉత్పాదనలను తమ అధీనంలో ఉన్న విక్రయ కేంద్రాలకు తరలించి అక్కడ వినియోగదారులకు అందించడం ఈ సంస్థ చేపట్టిన బాధ్యతలు. వినియోగదారులకు నేరుగా చేరవేయడానికి ఈ రకమైన వ్యవస్థను రూపొందించడం జరిగింది. సంప్రదాయక మార్కెట్‌లో లభించే ధరకన్నా దాదాపు 15-20 శాతం అధిక ధరను ఈ సంస్థ ఉత్పత్తిదారుకు అందిస్తుంది. సంస్థ నిర్వహణకు అవసరమైన మేరకు అదనపు మొత్తాన్ని కలిపి, వినియోగదారులకు విక్రయిస్తుంది. ఈ సంస్థ సేంద్రీయ సేద్యాన్ని, సంప్రదాయక వరి, జొన్నలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు (millets), పప్పు ధాన్యాల సాగును మాత్రమే ప్రోత్సహిస్తుంది. పోషకాహార విలువలు అధికంగా ఉన్న కారణంగానూ, ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్నందున ఈ ఉత్పాదనలకు పట్టణ ప్రాంతాలలో మంచి గిరాకీ ఉంటుంది. ముఖ్యంగా జొన్న, ఎర్రన్నం పట్టణ ప్రాంత వినియోగదారులకు చాలా రాష్ట్రంలో సేంద్రీయ ఉత్పాదనలను టోకుగా విక్రయించే సంస్థగా పేరు సంపాదించుకుంది. ఈ కారణంగా బెంగళూరు పరిసరాలలోని విక్రయశాలలకు దాదాపు 80 శాతం సరుకును అందజేయగలుగుతోంది. అయితే ఈ సంస్థకు సరుకులు నిల్వచేసేందుకు ఒక గిడ్డంగి ఉంది. ఒకే ప్రధాన విక్రయ కేంద్రం ఉన్నాయి.

ఇలా నేరుగా వినియోగదారులకు సరఫరా చేయడంతో పాటు ఏడాదికోసారి వివిధ నగరాలలో ఎర్రన్నంతో సిద్ధంచేసిన భోజనం సిద్ధంచేసి వాటి గురించి ప్రచారం చేసేందుకు కృషిచేస్తుంది. ఇంకా విత్తన ఉత్సవాలను నిర్వహిస్తుంది. సురక్షితమైన ఆహారం అంటే ఏమిటో ప్రజలలో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా 2 టైర్, 3 టైర్ పట్టణాలలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలలో రైతులు స్వయంగా వచ్చి పాల్గొంటారు. అక్కడే ఆసక్తి గల కొనుగోలుదారులకు వారు తమ ఉత్పత్తిని సరసమైన ధరలకే అమ్ముకుంటూ ఉంటారు. ఈ రకంగా నిర్వహించే కార్యక్రమాలలో సుమారు 10వేల నుంచి 20వేల మంది పాల్గొంటారు. కేవలం సేంద్రీయ వ్యవసాయ ఉత్పాదనలకోసం నిర్వహించే ఈ కార్యక్రమాలు స్థానికంగా పండించిన, నాణ్యమైన తాజా సరుకును వినియోగదారులకు అందించే కేంద్రాలుగా మారిపోతున్నాయి. అదే సమయంలో రైతులకు, వినియోగదారులకు మధ్య పరస్పరం మంచి సాన్నిహిత్యం ఏర్పడుతుంది. వినియోగదారు ప్రయోజనాలకు హామీ లభిస్తుంది. ఇలా వినియోగదారులకు నేరుగా పంట దిగుబడిని చేరవేయడానికి ఇలాంటి రైతు బజార్లు దేశమంతటా విస్తరించడం వల్ల అందరికీ లాభదాయకంగా ఉంటుంది.

## కీలక మలుపు

ప్రారంభంలో ఉత్పత్తిదారుల సంస్థగా ఏర్పడిన సహజ సమృద్ధ రైతుల కృషినే నమ్ముకుని రూపుదిద్దుకుంది. 2010లో ఈ సంస్థ రూ.5 లక్షల పెట్టుబడితో ఏర్పాటైంది. రైతుల నుంచి, రైతు సమాఖ్యల నుంచి సేకరించిన మొత్తమే ఇదంతా.

అయితే మొదటి సంవత్సరం నష్టాలే ఎదురయ్యాయి. ఆ మొత్తం ఖర్చయిపోయింది. దాంతో 2011-12లో మళ్లీ రూ.3 లక్షలు సమకూర్చుకోక తప్పలేదు. ఇదికాక, మరో రూ.5 లక్షల ఆర్థిక సహాయం బ్యాంకుల నుంచి లభించింది. ఈ మొత్తం నిధులతో సంస్థ తన కార్యకలాపాలను విస్తరించుకోగలిగింది. ఒక దశలో రూ.53 లక్షల వరకూ టర్నోవరు పెరిగినప్పటికీ నష్టాలు తప్పలేదు. దాదాపు రూ.1.5 లక్షలు నష్టపోయింది. 2012-13లో నాబార్డ్ సహకారం కూడా లభించింది. దాంతో సంస్థ విలువ రూ.83 లక్షలకు చేరింది. అప్పటికి కోటి రూపాయలను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ లక్ష్యం ఇంకా దూరంగానే ఉండిపోయింది. నిరంతరం కరువుకాటకాలు రావడంతో మళ్లీ నష్టాలు తప్పలేదు. దాంతో మొత్తం రూ.10 లక్షల వరకూ నష్టాలు ఎదురయ్యాయి. నాలుగో సంవత్సరంలో మాత్రమే కంపెనీకి కొంత సానుకూల వాతావరణం కనిపించింది. టర్నోవర్ రూ.1.27 కోట్లకు చేరింది. 2014-15లో సంస్థ టర్నోవర్ రూ.3.6 కోట్లకు చేరుకుంది. ఈ కారణంగా రూ.30 లక్షలు లాభాలుగా కనిపించాయి. ఇందులోనుంచి రూ.5 లక్షలను రైతుల వాటాగా పంపిణీ చేయగా, కొంత మొత్తాన్ని సంస్థ వ్యాపారావసరాలకు ప్రత్యేకించుకోవటం సాధ్యమైంది.

> రైతు బజార్ల ద్వారా వ్యవసాయ ఉత్పాదనలను నేరుగా వినియోగదారుకు చేరవేసే ఈ రకమైన మార్కెట్ సదుపాయాలు దేశమంతటా విస్తరించడం అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ మధ్య కాలంలో సంస్థ చాలా రకాలైన వ్యాపార నమూనాలను ప్రయత్నించింది. రిటైల్ వ్యాపారం నుంచి టోకు వ్యాపారం వరకు చేపట్టి ఫలితాలను అధ్యయనం చేయడం జరిగింది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా రైతులకు చెల్లించే మొత్తాలను మాత్రం ఏమాత్రం తగ్గించలేదు. లాభాలు తక్కువే అయినా సరే వ్యాపారం పెంచుకోవడం మీదే దృష్టి కేంద్రీకరించింది.

## కాయగూరల సేద్యంలో సేంద్రీయ విధానం – అధ్యయనం

బెంగళూరు శివార్లల్లోని కొన్ని గ్రామాలలో కాయగూరల పెంపకానికి సేంద్రీయ విధానం అనుసరించారు. ముఖ్యంగా అనేకల్ తాలూకాలోని మయాసాంద్ర గ్రామం దీనికి కేంద్రంగా నిలిచింది. ఇక్కడి రైతులంతా సంప్రదాయకంగా కాయగూరలను, పూల తోటలను పెంచడమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నవారు. వీళ్లంతా నిత్యం ఏదో ఒక రకం కూరగాయల పెంపకం మీదే ఆధారపడేవారు. చాలా గ్రామాలలో పరిస్థితి ఇలాగే ఉండేది. ఇక్కడ బీట్రూట్, క్యారెట్ సాగు ఎక్కువగా ఉండేది.

మొట్టమొదట 150 మంది రైతులను సేంద్రీయ సాగు విధానం చేపట్టేందుకు ప్రోత్సహించడం జరిగింది. మూడేళ్ల వ్యవధిలో ఆ సంఖ్య చాలా దారుణంగా తగ్గిపోయింది. చాలా కొద్ది మంది మాత్రమే సేంద్రీయ సాగు కొనసాగిస్తూ వచ్చారు.

ఆరంభంలో సేంద్రీయ సాగుకు ఎవరికీ అంత ఆసక్తి ఉండేది కాదు. ఎందుకంటే ఇలా సేంద్రీయ విధానంలో పండించిన ఉత్పాదనను విక్రయించేందుకు సిటీ మార్కెట్‌కు వెళ్లడానికి వాళ్లు సుమారు 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించవలసి వచ్చేది. అయితే కొద్ది మంది అందుకు కూడా సిద్ధపడ్డారు. అలాంటి వారి సంఖ్య గట్టిగా పది మంది ఉండేది. వారి కృతనిశ్చయం కారణంగానే మిగిలిన వారంతా కమ్యూనిటీ మార్కెటింగ ప్రక్రియ వైపు మళ్లడం సాధ్యమైంది. మొదట్లో 20 మంది అయ్యారు. తరువాత ఆ సంఖ్య 70కి చేరింది. వాళ్లంతా సేంద్రీయ విధానంలో పండించిన కూరలను మార్కెట్‌కు చేరవేయడం ప్రారంభించారు. వాళ్లంతా కలిసి సహజ సమయవ తరాకరి బేలగారార సంఘం పేరుతో ఒక సమాఖ్యగా ఏర్పడ్డారు. వాళ్లంతా ముందుగా తమ పంటను ఒకచోటికి చేర్చడం మొదలెట్టారు. అక్కడి నుంచి అందరి ఫలసాయాన్ని ఏక మొత్తంగా మార్కెట్‌కు తరలిస్తూ

వచ్చారు. ఫలితాలను, మార్కెట్ అవసరాలను చూసిన తరువాత వారు ఇలా ఒక పంట కాకుండా వివిధ రకాల కూరగాయల సాగు చేపట్టడం ప్రారంభించారు. దాదాపు 40 రకాల వేర్వేరు కూరలను పండించసాగారు. బెంగుళూరుతో పాటు రాష్ట్రంలోని వివిధ నగరాలకు వాటిని సరఫరా చేస్తూ వచ్చారు. మొత్తం మీద రైతన్నల రోజు టర్నోవర్ కేవలం రూ.700 నుంచి నెల తిరిగేసరికి రూ.5 లక్షలకు చేరింది.

సొంతంగా భూమి లేని వారు కూడా కాయగూరల పెంపకం చేపట్టారు. ఆ రకంగా వారికి తగిన జీవనాధారం చూపించడం సాధ్యమైంది. భూమి సెంటు కూడా లేని మంగళ అనే మహిళా రైతు కరివేపాకు, ఇంకా ఇతర ఆకు కూరల సాగు ద్వారా నెలకు రూ.1500 సంపాదించే స్థాయికి చేరింది. సొంతంగా భూమి లేని ఈమె తన ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ జాగానే ఆధారం చేసుకుని ఆకుకూరల పెంపకం చేస్తోంది. సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్ కంపెనీ సహకారంతో రైతు సమాఖ్యలు తమ మార్కెట్ అవకాశాలను విభిన్నమైన ప్రాంతాలకు, వస్తువులకు విస్తరించుకోగలిగాయి. పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లు, ప్రత్యేకంగా సేంద్రీయ ఉత్పత్తులను మాత్రమే విక్రయించే దుకాణాలకు లేదా సేంద్రీయ సాగుదారుల ఆదరణ సంపాదించిన వినియోగదారులకు నేరుగా వీరు తమ ఉత్పాదనలను సరఫరా చేస్తుంటారు. వేర్వేరు ప్రాంతాలలో వేరు వేరు రోజులలో ఏర్పాటు చేసే ఈ ఆర్గానిక్ మార్కెట్లను నెలకోసారి నిర్వహిస్తుంటారు. ఇలా చేయడం వల్ల వారి ఉత్పాదనలకు ఓ ప్రత్యేకమైన బ్రాండ్ నేమ్ లభించింది. వాటిని వినియోగదారులు సహజ వెగ్గీస్ (కూరగాయలు) అని వ్యవహరిస్తారు. వారం వారం జరిగే ఈ మార్కెట్లకు రైతులందరూ తమ ఉత్పత్తులను తరలించుకువస్తారు. సాధారణంగా ఏ వారంలో ఏ ప్రాంతం లో ఏ రకం కూరగాయలకు ఎక్కువ గిరాకీ ఉంటుందో గమనిం చడం వారు తీసుకునే మొదటి జాగ్రత్త. ముఖ్యంగా నాణ్యమైన వాటికే వారు ప్రాధాన్యం ఇస్తారు. నాణ్యతను బట్టి వారు తాము తీసుకువచ్చిన కూరలకు గ్రేడింగ్ నిర్ణయించుకుంటారు. ఆ తరువాత సరుకును లెక్కకట్టి వివిధ వ్యాపార దుకాణాలకు చేరవేస్తారు. వారు తీసుకువచ్చిన కూరలకు చెల్లింపులు కూడా వారానికి ఒకసారి జరుగుతాయి. ఇక్కడి రైతులకు ఐఎంఓ ధ్రువీకరణలు జారీచేస్తుంది. ఈ సంస్థ చాలా ప్రతిష్ఠాత్మకమైనది. చాలా పకడ్బందీగా రూపొందించిన ప్రామాణికాలు ఆధారం చేసుకుని ఖచ్చితమైన పర్యవేక్షణ తరువాత ఈ సంస్థ రైతులకు సర్టిఫికెట్లను అందజేస్తుంది.

హోసల్లి గ్రామానికి చెందిన 66 ఏళ్ల నాగరాజు అనే రైతు తన అభిప్రాయాలను తెలియచేస్తూ, నేరుగా మార్కెట్‌తో అనుసంధానం కారణంగా తనకు ఎంతో లాభం కలిగింది అంటున్నాడు. గడచిన నాలుగేండ్లలో తన ఆదాయం రెట్టింపు అయిందని ఆయన గర్వంగా చెప్పాడు. ''క్యారెట్లు, బీట్రూట్ పండించే నేను మార్కెట్‌లో అడుగుపెట్టిన తరువాత, సాధారణ రకానికి రూ.12 నుంచి రూ.18లు లభిస్తుంటే నేను రూ.25 నుంచి రూ.35 వరకు రేటు పొందేవాడిని. అందుకు కారణం నేను పండించే కూరలు సేంద్రీయ సాగు పద్ధతిలో పండించడం ఒక కారణమైతే సహజ బ్రాండ్‌తో విక్రయించడం మరో కారణం. మాకు అండగా నిలిచిన సహజ సంస్థకు కొంత చెల్లించినప్పటికీ, మాకు కనీసం 60 నుంచి 80 శాతం వరకు అధికంగా ఆదాయం సంపాదించగలుగుతున్నాం.''

ఈ ప్రాంతంలోని రైతులకు ఉన్న భూ వసతి చాలా తక్కువే. 0.5 ఎకరాల నుంచి గట్టిగా 2.5 ఎకరాల వరకూ మాత్రమే వారిలో భూమి ఉన్న రైతుల సంఖ్య ఎక్కువ. అయినా వారంతా గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారు. సేంద్రీయ విధానంలో రకరకాలైన కూరలను వారు సాగు చేస్తున్నారు. వారు పశుపోషణపై కూడా తమ దృష్టిని కేంద్రీకరించారు. ఆ కారణంగా వారు తమ చేలకు సంపూర్ణంగా పోషక విలువలు ఉన్న సేంద్రీయ ఎరువులనే ఉపయోగించగలుగుతున్నారు. అదే సమయంలో అధిక ఆదాయం కూడా సంపాదించుకోగలుగుతున్నారు. ◆

**G KRISHNA PRASAD AND B SOMESH**
Sahaja Samrudha
No.7, 2nd Class, 7th Main, Sulthanpalya,
Bangalore - 560 032.
www.sahajasamrudha.org

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 17, సంచిక 2, జూన్ 2015.

# మట్టి మాట్లాడితే

## ఎం. మహాదేవప్ప

మీ అందరికీ నేను బాగా పరిచయమే. ప్రతి రోజు నన్ను పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకూ, నిత్యం చూస్తూనే ఉంటారు. అయినా చాలా మందికి నా గురించి ఏమీ తెలియదు. ఎంతో మంది నన్నో జీవం లేని పదార్థం అనుకుంటారు. వారు నన్ను సరిగా అర్థం చేసుకోనేలేదు. నిర్జీవ పదార్థంగా నన్ను పరిగణించడమే కాదు, ఇతరులను చీదరించుకునే సమయంలో నా పేరెత్తి ఛీ అంటారు. ఉదాహరణ చెప్పాలంటే నీకేం తెలుసు మట్టి ముద్ద అంటుంటారు. ఇష్టం వచ్చినట్టు కాలితో తన్నుతుంటారు. గుంతలుగా తవ్వి పారేస్తారు. ముక్కలు చేసేస్తారు. నా గుండెలు పగులకొడతారు. పిండి చేస్తారు. కాల్చివేస్తుంటారు. నీళ్లలో ముంచి ముద్ద చేస్తారు. ఇటుకలు తయారు చేసుకుంటారు. పదులు, వందలు సంవత్సరాల పాటు ఒకచోట కట్టి పడేస్తారు. ఇవన్నీ చేస్తున్నప్పుడు వారి దృష్టిలో నేనో జడపదార్థాన్ని. వాళ్లెంతగా హింసించినా నాకు చావు లేదు. నేను బతికే ఉంటాను. శాశ్వతంగా నిలిచే ఉంటాను. ఆశ్చర్యంగా ఉందా? నన్ను ఇలా నిత్య చిరంజీవిగా మార్చివేసే మిత్రులు, బంధువులూ ఎవరా అనుకుంటున్నారా? దశాబ్దాలు గడిచినా, శతాబ్దాలు సాగినా నన్ను సజీవంగా బతికి ఉంచే వాళ్ల గురించి తెలుసుకోవలనుందా? వాళ్లని గురించి మీకు కూడా పరిచయం చేయనా?

నా గురించి బాగా తెలిసిన వాళ్లు - సూర్యచంద్రులు, గాలి, నీరు, పచ్చని ఆకులు, పచ్చని వాతావరణం అంతటా కనిపించే చెట్టూ చేమ, మొక్కా, గడ్డి, సకల జీవకోటి. (అంతేకాదు, మానవాళి కూడా) ప్రకృతిలో కనిపించే సకల జీవాలు నిస్వార్థంగా జీవనం సాగిస్తాయి. ఒక మానవ జాతికి మాత్రమే అంతులేని స్వార్థం నిలువెల్లా పేరుకుపోయుటుంది. మిగిలిన జీవజాలం నాకు అవసరమైన ప్రతీ పదార్థాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా నాకు అందజేస్తాయి. తెలిసి కానీ తెలియక కానీ మానవుడు తన చుట్టూ ఉన్న పచ్చని పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తున్నాడు. దాని ఫలితాలు నా శ్రేయోభిలాషుల మీద కూడా పడుతుంది. నా మనుగడే సమస్యగా మారిపోతుంది. నా పురోగతికి అడ్డంకులు ఏర్పడతాయి. నా మిత్రుల పురోగమనానికి, వాటి సంఖ్య ఎదుగుదలకు ఆటంకాలు ఎదురవుతాయి. నేను నిస్సారంగా మిగిలిపోతాను. నాతో పాటు ఇన్ని సమస్యలకు కారణమైన మనిషి కూడా నిరుపేదగా మారిపోతాడు. జంతు సంతతి సర్వమూ కోల్పోతుంది. ఇచ్చిపుచ్చుకోవడం ఈ ప్రకృతిలోని సకల జీవ రాశిలోనూ నిరంతరం కనిపించే ఉత్తమ లక్షణం. ఇలాంటి సహజసిద్ధమైన పరస్పర సహకారం భావంతో కలిసిమెలిసి జీవించినప్పుడే ఒకరి అవసరాలను మరొకరు నెరవేర్చగలుగుతారు. ఇది ఈ రోజు కొత్తగా వచ్చిన పరిణామం కాదు. భూగోళం మీద ప్రాణులు అవతరించిన నాటి నుంచి ఒకరి ప్రయోజనాలకు మరొకరు రక్షగా నిలుస్తున్నారు. ఈ మహోత్తమ ఉదారతత్వాన్ని నిత్యం ఉల్లంఘించే జీవి మనిషి మాత్రమే. ఒక్క మాటలో, అది కూడా స్పష్టంగా చెప్పాలంటే మానవాళి నుంచి ఎదురయ్యే అన్ని రకాలైన బాధలకు, వేదనలకు ఇతర జీవకోటి నుంచే నాకు ఊరట కలుగుతుంది. ఉపశమనం లభిస్తుంది. ప్రశాంతత ఏర్పడుతుంది. నా మిత్రుల గురించి కూడా చెప్పాలని ఉంది. అయితే ఆ విషయాలు కూడా తెలుసుకుందాం.

### సూర్యుడు

నా స్వరూపం, మనుగడ, పురోగతి, అనువైన వాతావరణం పూర్తిగా సూర్య కాంతిపైనే ఆధారపడి ఉన్నాయి. నాతో పాటు నాపైనే ఆధారపడిన ఇతర జీవరాశి మొత్తానికి, వాటి పెరుగుదలకు, మనుగడకు సూర్యరశ్మి అత్యవసరం. అసంఖ్యాకమైన జీవులన్నిటికీ ప్రయోజనం కలిగించే ఉపయోగపడే శీతోష్ణస్థితులు ఏర్పడేందుకు సూర్య కిరణాలు తోడ్పడతాయి. కాంతినిస్తాయి. మార్గం చూపిస్తాయి. నాకన్నా ముందుగానే ఆవిర్భవించిన సూర్యుడికి తన కాంతులతో చీకటి రేఖలను తొలగించడంలో సూర్యుడి పాత్ర చాలా ముఖ్యమైనది. నిజానికి చేతులెత్తి మొక్కవలసినదీ సూర్యుడికే. నిత్యం పగటి వెలుగులు ఉన్నా జీవకోటికి కష్టమే. అదే విధంగా నిరంతరం చీకటి రాత్రులు ఉన్నా కష్టమే. ఆ విషయాన్ని బాగా అర్థం చేసుకున్న సూర్యుడు ఏ జీవికీ ఇబ్బంది కలగకుండా ఎలాంటి ప్రమాదం ఎదురుకాకుండా - రాత్రింబగళ్లు రూపంలో సగం కాలం దూరంగా జరిగిపోయినట్టుగా కనుమరుగవుతాడు. మళ్లీ సకాలంలో దర్శనం ఇస్తాడు. ఇలా ఖచ్చితంగా సకాలంలో ఉదయించడం, అస్తమించడం అన్న కార్యక్రమాలు యాంత్రికంగా మారిపోయి ఆయనకు విసుగు పుట్టించవా అనే ప్రశ్న రాకమానదు. అప్పుడప్పుడు మేఘాల చాటుకు వెళతాడు. అప్పుడప్పుడు తనకూ, నాకు మధ్య చంద్రుడు వచ్చేలా చూసుకుంటాడు. ఆ క్రమంలో గ్రహణకాలం వస్తుంది. అదో అద్భుతం. చూసేందుకు రెండు కళ్లు చాలవు. సువిశాలమైన ఈ భూగోళం పై ఒక్కో సమయంలో ఒక్కో రకంగా ఈ గ్రహణ సన్నివేశం కనువిందు చేస్తుంది. మనలోని వేదనలను తొలగించేస్తుంది. ఇక శాస్త్రవేత్తలకు చేతి నిండా పని కల్పిస్తుంది. వాళ్లు ఆయన

ప్రతీ కదలికపైనా అధ్యయనాలను నిరంతరం చేస్తూనే ఉంటారు. వారి మనసులో అంతులేని ఆలోచనలకు సూర్యుడే కేంద్ర బిందువు. సమాజాభివృద్ధికి తన వంతు చేయూతనిస్తాడు. సూర్య ప్రతాపం కారణంగానే సముద్ర జలాలను సాధనంగా చేసుకుని మేఘాలను సృష్టిస్తాడు. అందులోకి నీటిని ఆవిరి రూపంలో చేరుస్తాడు. తిరిగి సకాలంలో ఈ నేలపైకి వర్షం రూపంలో అందిస్తాడు. భూసారాన్ని కాపాడుతూ ఉంటాడు. ప్రాణికోటి మనుగడకు అండగా నిలుస్తాడు. సూర్యుడి మరో ప్రత్యేకత ఏమిటంటే తన మిత్రుడైన చంద్రుడితో కలిసి చీకటి పడిన సమయంలో సూర్య రశ్మికి సాటికాకపోయినా చిరుకాంతి అందిస్తాడు. ఆ విధంగా గాఢమైన చీకటిలో ప్రయాణాలు చేసేవారికి దిక్సూచిగా సహకరిస్తాడు. నూతన దంపతులకు ఆశావహజీవితం అందిస్తాడు. ఆ రకంగా ఎప్పుడూ చీకటి రాత్రులు ఉండవని మనకు చెప్పకనే చెబుతున్నాడు. చంద్ర కాంతులు మనకు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి. హాయినిస్తాయి. అందుకు కూడా సూర్యగమనమే ప్రధానమైన ప్రేరకశక్తి. అంతేకాదు. చంద్ర కాంతి అయినా సరే ఏకరూపంలో ఎప్పుడూ ఉంటే అంతటి ఆనందానుభూతిని అందించదు. దానికంటూ ఏ విశేషమూ ఉండదు. అందుకే మధ్యలో మేఘాల తెరలను కప్పుతూ ఉంటాడు. మబ్బుల చాటున చంద్రుడి కోసం మనం ఎదురుచూడవలసిన ఆహ్లాదకరమైన సన్నివేశం ఎదురవుతుంది.

## చంద్రుడు – నక్షత్రాలు

నా మంచి చెడులు చూసే మరో నేస్తం - చంద్రుడి గురించి ఇప్పటికే కొంత చెప్పాను కదా. ఒక్కరుగా సాధించలేని కార్యాలను కూడా సమష్టిగా పరస్పర సహకారంతో సాధించవచ్చుననే జీవన సూత్రాన్ని సూర్య-చంద్రులు మనకి ఆచరించి చూపిస్తున్నారు కదూ? అద్భుతమైన తమ కాంతి కిరణాలతో ఈ రెండు నక్షత్రాలు చూసేవాళ్ల కళ్లకి అంతులేని ఆనందం అందిస్తాయి. మనసుకు ఆహ్లాదం ఇస్తాయి. కొన్ని సమయాలలో అవి మన పైనే వచ్చి మీదపడబోతున్నాయనే భయాందోళనలకు కూడా అవి కారణమవుతూ ఉంటాయి. అలాంటి సందర్భాలలో మానవాళి అంతమైపోతుందేమోనన్నంత విధ్వంసం, ఆస్తులకు తీరని నష్టం కలిగించేస్తాయి - అంతటి భయోత్పాతం కలిగించినా అంతలోనే అంతర్ధానమవుతాయి. వాటి అద్భుతాలను కనులారా చూసేందుకు మనం పైసా ఖర్చు పెట్టనక్కరలేదు. ఎలాంటి టికెట్టూ తీసుకోవలసిన అవసరం లేదు. ఎప్పుడూ ఈ నక్షత్రాలు అలా కంటికి ఆనందం కలిగిస్తే వాటికి ఎలాంటి విలువా ఉండదు కదా? అవునా? అందుకనే... అప్పుడప్పుడు అని మబ్బుల చాటున దాక్కుంటాయి. ఆ సమయంలో చుక్కలు అన్నీ మాయమైపోయాయనే అనిపిస్తుంది. కోటానుకోట్ల సంఖ్యలో ఉన్నప్పటికీ అవి ఒక దానితో మరొకటి దెబ్బలాడుకోవు. మన చుట్టూ ఉండే రాజకీయ నేతల్లా కప్పల తక్కెడలా ఒకరి స్థలం లోకి మరొకటి గెంతులు వేయవు. నక్షత్రాలు ఎప్పుడు తమకు నాయకుడిగా కదలకుండా నిలిచి ఉన్నట్లు కనిపించే ధృవ నక్షత్రం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. ఆ రకంగా ఈ నేల మీద ఉండే మానవాళికి దిక్కులను గుర్తించేందుకు సహాయపడతాయి.

## గాలి

అన్ని జీవాలకు ప్రాణాధారం గాలే అని అందరికీ తెలుసు కదా! గాలి ప్రభావం కారణంగానే అవసరమైనవీ, అవసరం లేనివీ - అంటే చెత్త, చెదారం, దుమ్మూ, ధూళీ - ఎక్కడికక్కడ పేరుకుపోకుండా వాటి దుష్ప్రభావం కారణంగా జీవజాలానికి ఎలాంటి హాని జరగకుండా రక్షణ లభిస్తోంది. గాలి వీచడం ద్వారా మాత్రమే మన చుట్టూ ఉష్ణోగ్రతలు సమతుల్య స్థితిలోనే ఉంటాయి. వాతావరణం అలా సమతుల్య స్థితిలో ఉంటేనే ఏ ప్రాణి అయినా ఒక చోట నుంచి మరో చోటికి సురక్షితంగా వెళ్లగలుగుతోంది. అన్ని ప్రాణులకూ గాలి పీలిస్తేనే ప్రాణం నిలుస్తుంది. ఈ శ్వాస క్రియనే సజీవంగా ఉన్నట్లు సూచిస్తుంది. పుప్పొడి పరాగమం వాయువు వల్లనే సాధ్యమవుతుంది. విత్తులను ఒక చోటి నుంచి మరో చోటికి వ్యాపిస్తూ ఉంటాయి. వాతావరణంలో నీటి తేమ పరిమిత స్థాయితో ఉంటుంది. పర్యావరణం కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉంటుంది. నిరంతరం ఒక చోట నిలవకుండా కదులుతూనే ఉండే గాలి మనకు చెబుతున్న గుణపాఠం ఏమిటో తెలుసా? - మానవాళి నిత్య చైతన్యంతో క్రియాశీలంగా ఉండాలి.

## నీరు

నీరు నాకు చాలా మంచి నేస్తం. అది లేకపోతే నేనే కాదు ఏ ప్రాణి సజీవంగా ఉండలేదు. నిర్జీవంగా మిగిలిపోవలసందే. నేను కూడా ఎండిపోయి, బీడుగా మారిపోతాను. నాకు చాలా దగ్గరగానే గంగముందుకు సాగుతుంది. ఎక్కడెక్కడి నీటిని చాలా జాగ్రత్తగా తీసుకెళ్లి అది చిన్న కాల్వలుగా, సెలయేళ్లుగా, నదులుగా, సముద్రాలుగా, మహా సముద్రాలుగా మార్చడంలో నా వంతు సాయం నేను అందిస్తాను. నీటి బిందువులు తగిలితే చాలు. మృదువుగా మారిపోతాను. ఏ రూపంలో మారిస్తే ఆ రూపం లోకి మారిపోతాను. అలా మృదువుగా మెత్తటి ముద్దలా ఉన్న సమయంలోనే మీకు ఏ దేవత రూపం కావాలంటే ఆ రూపంలో మీ ముందు నిలుస్తాను. అంతేకాదు, మీరు నాగలిపట్టి నా గుండెలు చీల్చి విత్తు చల్లి పంట పండించాలనుకున్నప్పుడు నాకు ఎంత బాధ కలిగినా సహిస్తాను. పంట చేలు పచ్చగా కళకళ-లాడేందుకు కారణమవుతాను. అలా పంటలు పండాలంటే నీరు నాకు చాలా అవసరం. ఇన్ని విధాలుగా మీకు ఉపయోగపడే నీటిని వేడి వేడి మంటల్లో వేడిచేసి ఎన్నో రకాలుగా ఉపయోగించుకుంటారు కదా మీరు. నీళ్లు ఇంటికి తీసుకెళ్లాలన్నా, నిల్వ చేసుకోవలన్నా కుండలు కావాలి కదా. కుండలు చేయడానికి

కుమ్మరికి నేను అవసరమే. నాతో పాటు నీరూ అవసరమే. మేం ఇద్దరం లేకపోతే మీరు నీరు ఎలా దాచుకోగలరు?

ఒక నిజం చెప్పనా? గడ్డీ, మొక్కా, చెట్టూ, చేమ, చిన్న చిన్న పురుగులూ, పశువులూ, పక్షులూ, జంతువులూ, చివరికి మనుషులు కూడా నా బిడ్డల్లాంటి వాళ్లే. నాకు ఏ తేడా ఉండదు. అయితే నాకు ఇంతమంది బిడ్డలున్నా, మనిషికి ఉన్నంత స్వార్థం మరే ఒక్కరిలోనూ లేదు. అయినా అందరినీ నేను సమానంగానే చూస్తాను. వాళ్లకి కావలసిన ప్రతి అవసరం గుర్తించి ముందే సిద్ధం చేసి అందిస్తాను. ఒక్క క్షణం కూడా నా బిడ్డల యోగక్షేమాలను నేను మరువను. కానీ దురాశతో స్వార్థం ఎక్కువైపోయి కొంతమంది ఇతరుల వాటాను కూడా తామే లాగేసుకుంటూ ఉంటారు. వాళ్లలోని ఆ స్వార్థ బుద్ధి చూస్తే నాకు చాలా బాధ కలుగుతుంది. వాళ్లు మిగిలిన సోదర జీవకోటికి దక్కవలసిన దానిని దక్కకుండా చేయాలని చూస్తారు. అందుకోసం దాచేసుకుంటూ ఉంటారు. అమాయకంగా నోరు లేని నా మిగిలిన బిడ్డల్ని నానా విధాలుగానూ బాధిస్తారు. మిగిలిన జీవకోటి యావత్తూ నా పైనే ఆధారపడి జీవించేందుకు సిద్ధంగా ఉంటాయి. నన్ను చాలా జాగ్రత్తగా చూసుకుంటాయి. నన్ను ప్రేమతో కాపాడుకుంటాయి. మనిషి ఒక్కడే మరెవ్వరికీ ఏ మాత్రం సహకరించడు. నాలో లోలోపల భూగర్భంలో భద్రంగా కాపాడుతూ వచ్చిన నీటి జాడలు పుష్కలంగా ఉండాలి. అలా నీటి వనరులను నేను కాపాడకపోతే ఈ బిడ్డలందరికీ ఏమీ దక్కదు. ఎందుకంటే నేను పచ్చగా కళకళలాడాలి అంటే నీరు చాలా అవసరం. నీరు లేకపోతే నేను సుభిక్షంగా నిలబడలేను. నేను సుభిక్షంగా లేకపోతే ఎవరికీ ఏమీ ఉండదు. ఏ జీవి బతికి బట్టకట్టలేదు. దురదృష్టం. నీటి వనరులను నాలో నాకు కూడా అందనంత అట్టడుగుకు నెట్టివేస్తున్నారు. అలాంటి నా ప్రియమైన నేస్తాన్ని నాకు కూడా అందనంత దూరం చేసేస్తున్నారు. దాని నీడ కూడా కనిపించటంలేదు. అట్టడుగుకు నెట్టేస్తున్నారు. దానికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోతోంది. శాస్త్రీయ పద్ధతులను అనుసరించి తెలివితేటలను ఉపయోగించి నీటి మట్టాలను పైకి అందించే స్థాయికి తీసుకువస్తే జీవులందరూ సుఖమయంగా మనుగడ సాగించగలుగుతారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

## దర్భ గడ్డి

నన్ను ఆధారం చేసుకుని ఎన్నో మొక్కలు, చెట్లు, పచ్చటి మైదానాలు పెరుగుతున్నాయి. అవన్నీ నాకు పెట్టని కోటలా నిలుస్తాయి. వాటి పేర్లు అన్నీ చెప్పాలంటే చాలా పెద్ద చిట్టా అవుతుంది. కానీ - ఒక్కదాని గురించి చెప్పుకోవాలి. దానిని దర్భ గడ్డి అంటారు. దీనినే హరియాలీ అని కూడా అంటారు. ఈ గడ్డి నాకు పెద్ద కవచంలా నిలిచి కాపాడుతుంది. ముఖ్యంగా వర్షాలు ముమ్మరంగా కురుస్తున్న సమయంలో నేను ఆ నీటి వేగానికి కొట్టుకు పోయే ప్రమాదం చాలా ఎక్కువ. ఈ గడ్డి రెమ్మలు నాకు అలాంటి ముప్పు రాకుండా రక్షణ ఇస్తాయి. మట్టి రూపంలో ఉన్న నాకు గుండెకోత లేకుండా కాపాడతాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న గడ్డి పేరు చెబితే చాలా మందికి అర్థమే కాదు. పర్యావరణాన్ని, భూసారాన్ని కాపాడడంలో గడ్డికి ఉన్న విశేష ప్రయోజనాలను వారు గుర్తించటం లేదు. పట్టణ ప్రాంతాలలో రోడ్లకు పక్కగా పెరుగుతున్న గడ్డి మొలకలను నిర్దాక్షిణ్యంగా పీకిపారేస్తుంటారు. అలా చేయటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని వారు అనుకుంటారు. నిజానికి అలా చేయటం వల్ల చాలా హాని జరుగుతుంది. వర్షపు నీటి కారణంగా నేను అడ్డంగా, నిలువుగా కోతకు గురవుతాను. గాలి గట్టిగా వేస్తే నేను ఎక్కడికో కొట్టుకుపోతాను. అది నాకున్న మంచి లక్షణం - మరిన్ని మొక్కలు లేదా పంట పెరిగేందుకు నాలో ఉండే సారవంతమైన శక్తిని కోల్పోతాను. ఇది చాలా అశాస్త్రీయమైన పద్ధతి. మనుషుల్లో సరైన అవగాహన లేకపోవటం వల్లనే ఇలాటి దురాలోచనలు వస్తున్నాయి. ఏ కారణం వల్లనైనా ఇతర మొక్కలను లేదా చెట్లను తీసేయవలసి వస్తే అది వేరే సంగతి. ఎట్టి పరిస్థితులలోనూ గడ్డిని మాత్రం అలా పీకేయకూడదు. ఈ వాస్తవాన్ని ఇప్పటికైనా మనిషి తెలుసుకుంటే చాలా మంచిది. అలా గడ్డిని కాపాడినప్పుడే నేను సురక్షితంగా మనుగడ సాగించగలుగుతాను. అన్ని జీవాలకు అండగా నిలుస్తాను. పచ్చటి గడ్డి మైదానాలు నిజానికి చూసే వాళ్ల కళ్లకి చాలా ఆనందం, ఆహ్లాదం కలిగిస్తాయి కదా. అంతేకాదు, మనుషులకు లేదా ఇతర జీవాలకు ఆరోగ్యం అందించే ఎన్నో ఔషధ గుణాలు ఈ గడ్డిలో ఉన్నాయి. వాళ్ళు చేసే ఎన్నో రకాల పూజల్లోనూ, ప్రార్థనల్లోనూ గడ్డికి విశేషమైన ప్రాధాన్యం ఉంది కదా. ఈ వాస్తవాలను తెలుసుకుని ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ సహజీవనం చేసేందుకు సిద్ధపడితే నాకూ, గడ్డికీ, అందరికీ ఎంతో మేలు జరుగుతుంది.

## ఆకులు – అలములు – పచ్చటి ఎరువు

నాకు నిత్యం సహాయకారిగా ఉండే మరో నేస్తం ఈ భౌతిక జీవ వ్యర్థ పదార్థాలు. ఇవి నన్ను నిత్యం సారవంతంగా కాపాడేందుకు తోడ్పడుతూ ఉంటాయి. వీటి ప్రాధాన్యత చాలా కొద్ది మందికే తెలుసు. విలువ తెలియని వాళ్లు చాలా నష్టపోతారు. ఈ మిత్రుడిని కాపాడటం చాలా సులువు. దీనిని మనం తీసి అవతల పారేయకుండా ఉంటే చాలు. వాటి చాటున ఎన్నో సూక్ష్మజీవాలు వృద్ధి చెందుతాయి. వాటి కదలికలు నన్ను సుభిక్షంగా నిలబెడతాయి.

## నా బిడ్డల గురించి..

నా బిడ్డలందరి మీద నాకు సమానమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. అవి ఎన్నో రకాలు. ఒక దానికి మరో దానికి పోలిక

ఉండదు. అంత విభిన్నంగా ఉంటాయి. సూక్ష్మక్రిములను మామూలు కళ్లతో చూడటం సాధ్యంకాదు. ఎందుకంటే అవి అంత చిన్నవిగా ఉంటాయి. వీటిని వైరస్ అని కూడా వ్యవహరిస్తారు.మరికొన్నిఉన్నాయి.అవిచాలాపెద్దవిగాఉంటాయి. అలాంటి వాటికి మంచి ఉదాహరణ ఏనుగులే. ఈ రెండు విభిన్నమైన జీవకోటికి మధ్య ఉన్న ప్రాణికోటి కోట్లాదిగా ఉన్నాయి. వాటిలో కొన్ని హానికరమైనవి. మరికొన్ని హితవు చేసేవి. భీకరమైన వాటిలో కొన్ని ప్రాణులు ఉన్నాయి. వాటిలో అన్నిటికన్నా ప్రమాదకరమైన జీవి - మనుషులే. మనిషిలా ప్రమాదకరమైన జీవాల్లో లాంటానా, ప్రాసోఫిస్, ఉపటోరియా, అజరాటస్ వంటివి చాలా ఏళ్లుగా మన మధ్యనే జీవిస్తున్నాయి. అయిదు దశాబ్దాల క్రితం వీటిలో చాలా హానికరమైన పార్థీనియం అనే విషపు మొక్క లాటిన్ అమెరికా నుంచి మన దేశంలోకి ప్రవేశించాయి. దీనిని చాలా ప్రాణాంతకమైన గడ్డి మొక్కల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఒకే ఒక్క మొక్క నుంచి దాదాపు 15000 విషపు విత్తులు వెలువడుతాయి. ఇది పెరిగిన చోట మరే మొక్కా బతకడం సాధ్యంకాదు. ఇందులోనుంచి వెలుపలికి వచ్చే విష ద్రవం నాలోకి ప్రవేశపెట్టి దానిని విషతుల్యంగా మార్చివేస్తుంది. మనుషులు లేదా పశువులు దీనిని తాకినా చాలు తీవ్ర అస్వస్థతకు గురవుతాయి. చాలా వ్యాధులకు కారణమవుతుంది. ఈ ప్రమాదకరమైన మొక్కల నుంచి ఎదురయ్యే హానికి విరుగుడు కూడా నా బిడ్డల్లోనే లభిస్తుంది. అయితే మనిషికి మాత్రం ఈ విషయం తెలియడం లేదు. అలాంటి విరుగుడు మొక్కలను అజ్ఞానంతో పీకిపారేస్తున్నాడు. ఆ రకంగా పర్యావరణానికి మేలు కలిగించే వాటినే అక్కరలేనివి అనే భ్రమతో పీకిపారేస్తున్నాడు. ఆ రకంగా అందరికీ ప్రమాదం కలిగించే పార్థీనియం వంటి మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతున్నాడు. ప్రతి మాతృ మూర్తిలాగే నేను కూడా నా బిడ్డలందరూ క్షేమంగా ఉండాలని, కలకాలం నిలిచి ఉండాలని కోరుకుంటాను.

## ఇక నా ఆరోగ్యం

జీవం ఉన్న నాకు ఇతర జీవకోటికి మల్లే అనారోగ్య సమస్యలు రావటం సహజమే కదా. రసాయనాలను అధిక మోతాదులో వాడడం నా ఆరోగ్యాన్ని చాలా దెబ్బతీస్తుంది. ఇటీవల మానవుడిలో స్వార్థ బుద్ధి పెరిగిపోయింది. తన అంతులేని కోర్కెలను తీర్చుకునేందుకు శాస్త్రం పేరుతో రకరకాల ప్రయోగాలు చేస్తున్నాడు. ఫలితంగా నా పరిస్థితి చాలా ఆందోళనకరంగా తయారైంది. సరైన పోషకాలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. నాకు సుస్తీ చేస్తోంది. ఈ మధ్య మరో దురాగతం విచ్చలవిడిగా సాగుతోంది. నా పరిస్థితిని అధ్యయనం చేస్తారట. ఆ రకంగా నా ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తారట. ఆ పేరుతో ప్రయోగశాలల్లో నన్ను రకరకాలైన పరీక్షలకు గురిచేస్తున్నారు. కొంతవరకు ఇది నాకు తృప్తి కలిగిస్తోంది. నాకు ఎదురవుతున్న లోపాలను గుర్తించగలిగితే, వాటిని తిరిగి సమకూర్చగలిగితే.. అంతకన్నా కావలసింది ఏముంటుంది? ఈ విధంగా నా అనారోగ్యానికి కారణాలను తెలుసుకునే నైపుణ్యం ఉన్న వాళ్ల సంఖ్య చాలా తక్కువగానే ఉంది. నా ఆరోగ్యం బాగుండాలంటే కనీసం 16 రకాలైన పోషకాలు చాలా అవసరం. నా బిడ్డలకు ఒక్కొక్కరికి ఒక్కో రకమైన పోషకాలు అవసరం. వాటిని అందించగలగాలంటే నా దగ్గర అవి సమృద్ధిగా ఉండాలి కదా? అందుకు శాస్త్రీయ పద్ధతుల్లో నాకు అవసరమైన పోషకాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాంటివాటిలో ఆకు పచ్చని ఆకులు, అలములతో తయారు చేసిన ఎరువు చాలా మేలు చేస్తుంది. నా ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకోవాలంటే.. ఎవ్వరూ ఏమీ ఎక్కువ కష్టపడనవసరంలేదు. నా బిడ్డల ఎదుగుదలను చూసి ఎవరైనా చెప్పేయగలుగుతారు. నా రంగు చూస్తే చాలు. తెలిసిపోతుంది. నా ఆరోగ్యం గురించి జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బడిముబ్బడిగా ప్రతిఫలాన్ని అందిస్తాను. లాభసాటి అయిన పంట దిగుబడులు అందిస్తాను. నాలో పెరుగుతున్న లోపాలను నిర్ణయించేందుకు తోడ్పడుతున్న ప్రయోగశాలల కృషిని గుర్తించి కృషి విజ్ఞాన్ కేంద్రాలు, కృషి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ వ్యవసాయ శాఖల నీడలో మానవులు నడిస్తే నా ఆరోగ్యం భద్రంగా ఉంటుంది. నా ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకునే వాళ్లకి, కాపాడే ప్రయత్నం చేసే వాళ్లకి, అందుకు అండగా నిలిచే మీడియా రంగానికి నేను కృతజ్ఞురాలనై ఉంటాను.

## ఒక విజ్ఞప్తి

నా అభ్యర్థన చాలా మందికి అర్థం కాకపోవచ్చు. నా గురించి సరైన అవగాహన కలిగించే పుస్తకాలేవీ అందుబాటులో లేవు. ఇక మీడియా నన్ను పూర్తిగా విస్మరించింది. పిల్లలూ, పెద్దలూ కూడా సినీ తారలు, క్రికెట్ ఆటగాళ్ల గురించి ఎన్ని విషయాలైనా తెలుసుకుంటారు. నా గురించి తెలుసుకునేందుకు ఏ మాత్రం ఆసక్తి ఉండదు. ప్రయత్నం ఉండదు. ఈ దేశంలోని విద్యా సంబంధ పాఠ్య పుస్తకాలలో కూడా కొంచం కూడా సమాచారం ఉండదు. పాఠ్య ప్రణాళికలలో, ప్రాథమిక పాఠశాలలు కానీ, సెకండరీ స్థాయిలో కానీ, నా గురించి లేదా నా మిత్రులు - పర్యావరణం, మిగిలిన నా బిడ్డల గురించి - తెలియచెప్పే అంశాలు ఏమీ ఉండవు. ఇది నాకు చాలా బాధ కలిగిస్తోంది. పాలకుల నిర్లక్ష్యం నాకు వేదననే మిగులుస్తోంది. ప్రతి ఒక్కరూ నా గురించి తెలుసుకుని నన్ను కాపాడేందుకు ప్రయత్నించినప్పుడే ఈ దేశంలో సుభిక్షం, సుఖశాంతులు, మంచి రోజులూ కలుగుతాయి. ◆

**Prof. M MAHADEVAPPA -** Director (Rural Development)
JSS Mahavidyalaya, Mysuru - 570004

మూలం :
లీసా ఇండియా కన్నడ, సంచిక 4, డిశంబర్ 2015.

# సేంద్రీయ సేద్యమే సురక్షితం

కరువుకాటకాలకు మారుపేరుగా మారిన నెనమనహళ్లి (కోలారు జిల్లా) గ్రామంలో హరిత విప్లవం రావడానికి ఎస్.ఆర్. చంద్రశేఖర్ అనే రైతన్న కృషే కారణమని చెప్పకతప్పదు. కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న ఈ జిల్లా ఇతర విషయాలకన్నా వేల సంఖ్యలో ఉన్న అందమైన చెరువులకు బాగా సుప్రసిద్ధమైంది. అది ఒకప్పుడు. ఇప్పుడు ఆ నాటి చెరువులు లేవు. బోరు బావులు లేవు. వాటిలోని నీరు అట్టడుగు వరకూ ఎండిపోవడంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ జిల్లాలో భూగర్భ జలాలు 1200 అడుగుల లోతుకి వెళ్లినా చుక్క నీరు పడని స్థాయికి దిగజారిపోయాయి. ఈ జిల్లాలో నిత్యం నీరు అందించే జీవనదులు ఏవీ లేవు. అందువల్ల క్లిష్ట పరిస్థితులలో చంద్రశేఖర్ వ్యవసాయం చేపట్టి మంచి ఫలితాలు సాధించి చూపించాడు. అందుకు ఆయన అనుసరించిన మార్గం - అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి సహజ వనరులను సక్రమంగా ఉపయోగించుకుంటూ, సేంద్రీయ సేద్యం చేపట్టడమే.

ఆయనకు ఉన్న భూమి కేవలం 30 గుంటలు (కేవలం 0.75 ఎకరా) మాత్రమే. అందులోనే ఆయన 500 బొప్పాస చెట్లు, 300 మామిడి చెట్లు, 1500 మల్బరీ మొక్కలు, కొంతభాగంలో కందులు, ఇంకా అనేక ఇతర రకాలైన బీన్స్, సోయాబీన్స్ వంటి అంతర-పంటలను సాగుచేపట్టాడు. కోలార్ జిల్లాలో నీటి లభ్యత చాలా ఖరీదైన వనరు కావటంతో, ఒక విధంగా చెప్పాలంటే బంగారం కన్నా ఎక్కువ ధర ఉంటుంది, ఆయన ఒక పరిష్కార మార్గం కనుగొన్నాడు. అదేమిటంటే - పొడవు, వెడల్పు, లోతు కూడా 3 అడుగులు ఉండే విధంగా తొట్టెల వంటి గోతులను సిద్ధం చేసాడు. వాటి సంఖ్య దాదాపుగా 45-50 వరకూ ఉంటుంది. అదే విధంగా పొడవు, వెడల్పులు 2 అడుగులు ఉండేలా రాగిమొక్కలను పెంచడం ప్రారంభించాడు. ఈ గోతుల్లోకి చేరుకునే కొద్దిపాటి నీటిని పొదుపుగా ఉపయోగించుకోవడమే కాక, నీటి తేమ పొడారిపోకుండా, భూసారం కాపాడే విధంగా ప్రతీ నాలుగైదు గోతులకు చుట్టూ హెబ్బల్ బీన్స్ మొక్కలను నాటేవాడు. బెండ సాగు ఫలాలు చేతికి అందిన తరువాత, ఈ హెబ్బల్ బీన్స్ పంట చేతికి వచ్చేది. అంతేకాక, ఆయన తన 30 గుంటల పొలంలో 70 అడుగుల పొడవు, 50 అడుగుల వెడల్పు, 12 అడుగుల లోతు ఉండే చిన్నపాటి చెరువును నిర్మించుకున్నాడు. ఇందులోకి చేరుకునే నీటిని అత్యవసర సమయాలలో



సేంద్రీయ విధానాలు అనుసరించే రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న చంద్రశేఖర్

మొక్కలను కాపాడుకునేందుకు ఉపయోగించేవాడు. తన పొలంలోని ప్రతీ అంగుళం నేలను ఆయన చాలా విలువైనదిగా భావించేవాడు. ఈ వివిధ రకాలైన పంటలతో పాటు హార్స్ గ్రామ్ (ఉలవలు), జనుపనార, ధియన్చా అనే రకపు మొక్కలు, ఇంకా ఇతర భూసార రక్షణకు తోడ్పడే కొన్ని మొక్కలు (వాటిని డికోటీలెడోనస్ అని ఆంగ్లంలో వ్యవహరిస్తారు. ఈ రకం మొక్కలలో రెండు కణాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటికి భిన్నంగా ఏక కణ మొక్కలు వాటిని మోనోలెడోనస్ అంటారు) సాగుచేస్తాడు. ఇవి భూసారాన్ని కాపాడటంలో కీలకంగా పరిగణిస్తారు. భూసారంతో పాటు మట్టిలో తేమ స్థిరంగా నిలిచేందుకు ఇవి ఉపయోగపడతాయి. వీటిలో హార్స్ గ్రామ్ కారణంగా పొలంలో రాలిపడే ఆకులు, ఇతర వ్యర్థాలు అక్కడి మట్టిలో సేంద్రీయ లక్షణాలను మెరుగుపరుస్తాయి. రసాయనాలు ఎక్కువగా ఉపయోగించే రైతన్నలకు ఇది చాలా ఉత్తమమైన ప్రత్యామ్నాయం. ఈ మొక్కలతోపాటు చంద్రశేఖర్ సుబాబులం, లిన్ సీడ్ గ్లైరిసీడియా చెట్లను విరివిగా పొలం చుట్టూ పెంచుతూ వచ్చాడు. ఈ వివిధ రకాలైన మొక్కలు, చెట్ల నుంచి రాలిపడే ఆకులను, అలములను పొలం అంతటా ఎరువులకు మారుగా విస్తృతంగా ఉపయోగించేవాడు. ఫలితంగా భూసారం మెరుగయ్యేది. దిగుబడి అధికమయ్యేది.

అన్నిటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే - పరిమితంగా ఉన్న నీటి వనరులను ఆయన చాలా పొదుపుగా ఉపయోగించేవాడు. మొక్కలకు అవసరమైన నీటిని సీసాలలో నింపి అందించేవాడు. నీటితో నింపిన సీసాలను మొక్కలకు కనీసం

ఆరు అంగుళాల దూరంలో భూమిలో పాతిపెట్టేవాడు. అయితే అలా పాతిన సీసాలు ఆ మొక్కల వేళ్లకు దగ్గరగానే ఉండేట్లు చూసుకునేవాడు. వేసవిలో సీసాలలో నీటిని నింపిన తరువాత అవి ఆవిరై పోకుండా కాపాడేందుకు మొక్కల వేళ్లకు చేరేలా జాగ్రత్త తీసుకునేవాడు. ఉదాహరణకు, మామిడి మొక్కలకు నీరు పోయాలంటే బకెట్లలో పోయవలసి ఉంటుంది. 300 మొక్కలకు నీరు అందించాలంటే కనీసం 300 కుండల నీటిని సేకరించుకోవాలి. కానీ, ఆయన అనుసరించిన ఈ పద్ధతిలో ఒక కుండ నీరు 26 మొక్కలకు కావలసిన నీటిని సమకూర్చేది. అంటే మొత్తం 300 మొక్కలకు కేవలం 12 కుండల నీరు సిద్ధం చేసుకుంటే చాలు. ఆ రకంగా ఆయన 288 కుండల నీటిని ఆదా చేసుకునేవాడు. అంతేకాక, ఎంతో సమయాన్ని మిగుల్చుకునేవాడు. శ్రమను తప్పించుకునేవాడు. 2010లో ఆయన మామిడి దిగుబడి 20 టన్నులు, బొప్పాయి పంట చేతికి వచ్చిన తరువాత మామిడి దిగుబడి వచ్చేది. వీటితో పాటు ఆయన తేనె సేకరణ వ్యాపారం కూడా చేపట్టేవాడు.

చంద్రశేఖర్ సాధించిన విజయాలు ఆయనను ఆ ప్రాంతంలోని రైతన్నలందరికీ ఆదర్శంగా నిలిచాడు. సేద్యం చేయడంలో అవసరంలేని ఖర్చులను తగ్గించుకునేందుకు ఆయన చాలా కృషి చేసేవాడు. అందులో భాగంగానే ఆయన సేంద్రీయ వ్యవసాయం అనుసరించాడు. రసాయనాలు వాడవలసిన అవసరం లేకుండా చూసుకున్నాడు. సేద్యం జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆయన చూపిన మార్గం అనుసరిస్తే క్లిష్ట సమయాలలో కూడా మంచి లాభాలను సంపాదించుకోగలుగుతారు. ఆయన నోట ఇప్పుడు సగర్వంగా వినిపించే మాటలు పర్యావరణకు మరింత హాని జరగకుండా భవిష్యత్ తరాలు జీవించేందుకు ఇదే సరైన మార్గం ◆


**N.R. CHANDRASEKHAR**
Organic farmer and progressive farmer
Nenumanahalli, Kolar Taluk, Kolar District, Karnataka
Tel : 08152 238971, Mobile : 9448342803.

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 17, సంచిక 3, సెప్టెంబర్ 2015.

www.leisaindia.org
A website for learning and sharing experiences on LEISA practices

Main Features

- Space to share your LEISA experience.
- A source for LEISA practices followed by farmers.
- An archive of LEISA India magazines—English edition and regional editions (Kannada, Tamil, Hindi, Telugu, Oriya, Punjabi and Marathi)
- Photos and videos on LEISA practices.
- Interesting cases of people following LEISA practices.




Follow us on Facebook: www.facebook.com/Leisaindiamag Follow us on Twitter: @LeisaIndia